ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 21 సెప్టెంబరు 2025



జ్ఞాపకాలను తుడిచేసే అల్జీమర్స్
- 60 ఏళ్లు దాటిన వృద్ధుల్లో పెరుగుతున్న మతిమరుపు సమస్య
- చిన్నగా సమస్య మొదలై ఎనిమిదేళ్లలో తీవ్రమయ్యే అవకాశం
- నేడు వరల్డ్ అల్జీమర్స్ డే -8లో

సాహితీ వేగుచుక్క 'గురజాడ' -8లో

ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూములు

- దర్జాగా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

నకిలీ ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్లు



అనకాపల్లి మండలంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రంథాలయ భవనం ఎదుట ఆక్రమణకు గురైన స్థలం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కొన్ని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. లంకెలపాలెం, సిరసపల్లి, మారేడుపూడి, సాలాపువానిపాలెం, కొత్తూరు, కొప్పాక, కాలేజ్ జంక్షన్ పరిసరాల్లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి. ప్రభుత్వ భూముల్లో దర్జాగా పాగా వేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

అనకాపల్లి పట్టణంలోని కాలేజీ జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారిని ఆనుకొని సర్వే నంబర్లు 674-10, 674-11లలో సుమారు 33 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇందులో 5 సెంట్ల భూమిని డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించారు. ఇప్పటికే ఆ స్థలంలో డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇదే సర్వే నంబరులోని 10 సెంట్ల స్థలాన్ని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయానికి కూటమి ప్రభుత్వం కేటాయించింది. ఇటీవల ఈ భూమిలో భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు కలెక్టర్ విజయకృష్ణన్ శంకుస్థాపన కూడా చేశారు. 674-10 సర్వేలో మిగిలిన 18 సెంట్ల భూమిని కొందరు కబ్జా చేశారు. అంతటితో ఆగకుండా సదరు వ్యక్తులు ఆక్రమించిన ప్రభుత్వ భూమికి సమీపంలోని 674-8, 674-9 జిరాయితీ భూముల సర్వే నంబర్లతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోగలిగారు. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా ఆక్రమణదారులు 674-10లోని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘ భవనానికి కేటాయించిన స్థలాన్ని కొందరు సొంతం చేసుకొనే ప్రయత్నం చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అలాగే అనకాపల్లి శివారులో జాతీయ రహదారికి చెందిన సర్వే నంబరు 1652/599లోని డబుల్ ట్రంపెట్ ఫ్లైఓవర్ సమీపంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. సబ్బవరం మీదుగా ఆనందపురం వెళ్లే ఫ్లైఓవర్‌కు సమీపంలో ఒక టింబర్ డిపో నిర్వాహకుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేయింగ్ మెషీన్‌ను, ప్రైవుట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై గతంలో ఫిర్యాదులు అందడంతో విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా సదరు టింబర్ డిపో యజమానికి నోటీసులు జారీ చేసి వదిలేశారు. ప్రస్తుతం ఫ్లైఓవర్‌కు ఆనుకొని భారీ షెడ్డు, గోడ నిర్మించి టింబర్ డిపోను నిర్వహిస్తుండడం గమనార్హం. అంతే కాకుండా పరవాడ మండలం లంకెలపాలెం, సాలాపువానిపాలెం, మారేడుపూడి, కొత్తూరు, సిరసపల్లి, జాతీయ రహదారిని ఆనుకొని వున్న కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల పరిధిలో విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ, జాతీయ రహదారుల విభాగం అధికారులు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



అనకాపల్లిలో డబుల్ ట్రంపెట్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఆనుకొని నిర్మించిన టింబర్ డిపో గోదాము

టెక్నాలజీ సాయంతో కేసుల దర్యాప్తు

స్థానికంగా గంజాయి నేరాలకు పాల్పడుతున్నవారిని గుర్తిస్తున్నాం

- హాస్టళ్లు, ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- డీఐజీ గోపీనాథ్ జెట్టి



రూరల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

నర్సీపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో టెక్నాలజీని ఉపయోగించి పోలీసులు మెరుగైన సేవలు అందిస్తున్నారని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో డ్రోన్ కెమెరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిని, గంజాయి రవాణా చేసేవారిని గుర్తించడానికి డ్రోన్‌లు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కేసుల దర్యాప్తులో కొన్ని రకాల అప్లికేషన్లు ఉపయోగిస్తున్నామన్నారు. అన్ని ప్రార్థనామందిరాలు, వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. బయట ప్రాంతాల నుంచి వచ్చి స్థానికులతో కలిసిపోయి గంజాయి రవాణాకు పాల్పడుతున్నారన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించామని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే రోజుల్లో నేరాల్లో 50 శాతం సైబర్ నేరాలు ఉంటాయన్నారు. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు ఎక్కువగా ఉన్నవారిని లక్ష్యంగా చేసుకొని డిజిటల్ అరెస్టులు పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. డిజిటల్ అరెస్టులు అనేవి లేవని, సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల నియంత్రణకు శక్తి టీమ్స్, శక్తి యాప్ ఉపయోగపడుతున్నాయని, పిల్లలపై జరుగుతున్న నేరాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

దారికి రాని పనులు

నెల రోజుల్లో బీఎన్ రోడ్డు పనులు కొలిక్కి తీసుకు వస్తామని కోర్టుకు కాంట్రాక్టర్ హామీ

- గడువు ముగిసినా ఒక్క గుంత కూడా పూడ్చని వైనం
- ఉన్నతాధికారులు, న్యాయస్థానం ఆదేశాలు సైతం బేఖాతరు
- ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికుల విస్మయం



మండలంలోని గోవాడ సమీపంలో గల అంభేరుపురం వద్ద బీఎన్ రోడ్డు ప్రధాన రహదారి

చోడవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

నెల రోజుల్లో బీఎన్ రోడ్డు పనులను కొలిక్కి తీసుకు వస్తామని స్థానిక జిల్లా కోర్టుకు కాంట్రాక్టర్ ప్రతినిధి ఇచ్చిన హామీ నెరవేరలేదు. గడువు ముగిసినా ఒక్క గొయ్యి కూడా పూడ్చలేదు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని గంధవరం, వెంకన్నపాలెం నుంచి అటు మాడుగుల మండలం గరిక బంధ వరకు, ఇటు వడ్డాది నుంచి నర్సీపట్నం వరకు రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎన్ రోడ్డు పనులకు సంబంధించి ప్రస్తుత కాంట్రాక్టర్ టెండర్‌ను రద్దు చేయనంత వరకు కనీసం గోతులు పూడ్చడానికి నిధులు మంజూరుకావని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్అండ్‌బీ నిబంధనల ప్రకారం టెండర్ పనులు ప్రారంభమైన రోడ్డులో నిర్వహణ పనులకు మళ్లీ నిధులు మంజూరు చేసే అవకాశం ఉండదు. ఈ కారణంగా కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చేస్తే తప్ప, రోడ్డులో గోతులు కూడా పూడ్చేందుకు అవకాశం ఉండదు. బీఎన్ రోడ్డులో ఎన్‌డీబీ గ్రాంటు టెండరు రద్దు చేసినట్టయితే, కనీసం గోతుల మరమ్మతుల వరకైనా నిధులు తెచ్చి పనులు పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి బీఎన్ రోడ్డు కాంట్రాక్టర్‌ను మార్చి, ఈ రోడ్డు అభివృద్ధి పనులు పట్టాలెక్కించే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

27కి న్యాయవాదుల కేసు వాయిదా

బీఎన్ రోడ్డు దుస్థితిపై స్థానిక న్యాయవాదులు దాఖలు చేసిన కోర్టు కేసు ఈ నెల 27కి వాయిదా పడింది. ఈ కేసుపై శనివారం విచారణ జరగాల్సి ఉండగా, జిల్లా జడ్జి కోర్టుకు సంబంధించిన సమావేశానికి హాజరైన కారణంగా ఈ నెల 27కి వాయిదా వేశారు. బీఎన్ రోడ్డు దుస్థితిపై స్థానిక న్యాయవాదులు కాండ్రేగుల డేవిడ్, భరత్ భూషణ్, తదితరులు కోర్టులో కేసు వేయడం, దీనిపై కోర్టు ఆర్అండ్‌బీ ఎన్‌డీబీ చీఫ్ ఇంజనీరు, సంబంధిత కాంట్రాక్టర్ కోర్టు ముందు హాజరుకావాలని ఇచ్చిన నోటీసుల మేరకు, గత నెల 20న ఆర్ అండ్‌బీ ఎస్ఈతో పాటు, కాంట్రాక్టర్ తరఫున ప్రతినిధి హాజరైన సంగతి తెలిసిందే. నెల రోజుల వ్యవధిలో బీఎన్ రోడ్డు పనులను కొలిక్కి తీసుకు వస్తామని ... మిగతా 8వ పేజీలో

వర్షంతో ఊరట

- ఉదయం నుంచి ఎండ
- సాయంత్రం భారీ వర్షం



అనకాపల్లి ఉడ్‌పేటలో వర్షం

అనకాపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి/న్యూస్ నెట్‌వర్క్): జిల్లాలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి జనం ఉపశమనం పొందారు. పలు చోట్ల ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా, సాయంత్రం నుంచి వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. చోడవరం, బుచ్చెయ్యపేట, కృష్ణాదేవిపేట, మాడుగుల మండలాల్లో సాయంత్రం కొద్దిసేపు ఒక మోస్తరు వర్షం పడింది. మునగపాక మండలంలో ఈదురు గాలులతో కూడిన వాన కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అనకాపల్లి, సబ్బవరం, కశింకోట, ఎలమంచిలి, కోటవురట్ల, రావికమతం, ఎస్.రాయవరం మండలాల్లో వాతావరణం చల్లబడి తేలికపాటి జల్లులు కురిశాయి. చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, రావికమతంలో రాత్రి ఏడు గంటల నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. గత రెండు, మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కబోతతో విలవిలలాడిన జనం శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాలతో సేద తీరారు.



కేబీ రోడ్డులో కూలిపోయిన చెట్లను తొలగించే పనులు చేయిస్తున్న అనకాపల్లి రూరల్ ఎస్ఐ రవికుమార్

అనకాపల్లి పట్టణంలో..

అనకాపల్లి టౌన్: అనకాపల్లి పట్టణంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4.30 గంటలకు దట్టంగా మేఘాలు అలుముకుని ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. చీకటి వాతావరణం నెలకొనడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాయి. సుమారు 20 నిమిషాల పాటు వర్షం పడడంతో రహదారులు జలమయమయ్యాయి. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షపునీరు నిలిచిపోవడంతో కాంప్లెక్స్‌లోకి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నేలకొరిగిన 8 విద్యుత్ స్తంభాలు

కొత్తూరు: అనకాపల్లి మండలం గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ... మిగతా 8వ పేజీలో

ప్రశంసే ఆమెకు పెద్ద బహుమతి

- ఆమె శ్రమను గుర్తిస్తే అదో ఆనందం
- భార్య యోగ క్షేమాలు తెలుసుకోవడం భర్త కనీస బాధ్యత
- అన్ని విషయాల్లో ఆమెకు ప్రాధాన్యం ఇవ్వాలి
- చేసే పనిని గుర్తించాలి

నేడు భార్యను ప్రశంసించే రోజు సందర్భంగా....

బంధాన్ని బలపరిచే అద్భుత టానిక్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు అలుపెరుగకుండా శ్రమించేది ఇంటి ఇల్లాలు. ఓ కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా ఉందంటే అది ఆమె ఘనతే. తన గురించి ఆలోచించుకోకుండా కుటుంబ సభ్యుల కోసం కష్టపడే గొప్ప మనసు ఆమెది. ఓ తియ్యని, ఆప్యాయమైన ప్రశంస ఆమె పడిన కష్టాన్నంతా మరిచిపోయేలా చేస్తుంది. సంసార జీవితంలో భార్యను ప్రశంసించే భర్త వుంటే ఆ బంధం కలకాలం దృఢంగా నిలుస్తుంది. ఈ ఆదివారం భార్యను ప్రశంసించే రోజు సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. ఇంటి చాకిరీ మొత్తం చేసే భార్యను రెండు పదాలతో సంతృప్తి పరచగలమంటే నమ్మగలరా?, ఆ రెండు పదాలతో ఆమె పడ్డ కష్టం అంతా ఆవిరైపోతుందంటే...విశ్వసించగలరా? నమ్మినా నమ్మకపోయినా ఇది సత్యం. నగటు భార్యను సంతోషపెట్టాలంటే ప్రేమతో కూడిన ప్రశంస చాలు. ఇల్లు ఊడ్చడం మొదలు..వంట, గిన్నెలు తోముకోవడం, దుస్తులు ఉతకడం.. ఒక్కటేంటి...అన్ని పనులు ఉరుకులు పరుగుల మీద ఆమె చేసుకోవాల్సిందే. పిల్లలు ఉంటే మరింత పని ఒత్తిడి. కానీ అంతటి శ్రమను ఒక్క ప్రశంసతో మటుమాయం చేసుకునేతత్వాన్ని భగవంతుడు ఆమెకే ఇచ్చాడు. కానీ ఏడాదంతా భార్య శ్రమను చూసీ చూడనట్టు వదిలేస్తున్న భర్తలే సమాజంలో అధికంగా ఉన్నారు. అందుకే కనీసం ఏడాదిలో ఒక్కసారైనా వాళ్లను ప్రశంసించేలా 'వైఫ్ అప్రిషియేషన్ డే'ను ఏటా సెప్టెంబర్ మూడో ఆదివారం నిర్వహిస్తున్నారు. దీని వెనుక కచ్చితమైన చరిత్ర లేకపోయినా..ఇటీవల కాలంలో ఈ రోజుకు ప్రాధాన్యం పెరుగుతోంది.

పైకి చెప్పరు...

మహిళలతో పోలిస్తే..పురుషుల్లో భావవ్యక్తీకరణ చాలా తక్కువ. భార్యపై ఎంత ప్రేమ ఉన్నా..బయటకు చెప్పే నేర్పు చాలామంది పురుషుల్లో లోపిస్తోంది. ఆమె పడ్డ శ్రమను లోలోనే అభినందిస్తారు తప్ప..ఆమెతో నేరుగా చెప్పరు. అదే భార్యలో అసంతృప్తికి కారణమవుతోంది. 'కోడి కూసిన దగ్గర నుంచి గొడ్డులా కష్టపడినా...ఈ కొంపలో గుర్తింపు ఉండదు' అనే బాధ చాలా మందిలో కనిపిస్తుంది. మన కోసం అనుక్షణం కష్టపడే ఆమెను ప్రశంసించడం నేరం కాదన్న విషయాన్ని గుర్తించాలి. ఆమె శ్రమను గుర్తించాలి. ఆమె చేసే మంచి పనిని గుర్తించి ... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎం మృతి



వంకల సత్యం (ఫైల్ ఫొటో)

కశింకోట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎస్.రాయవరం మండలం వాకపాడు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందారు. కశింకోట మండలంలోని బయ్యవరం హెరిటేజ్ పాల ఉత్పత్తుల కేంద్రం కూడలి వద్ద శనివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి. విశాఖపట్నం జిల్లా హనుమంతవాక డెయిరీఫాం ప్రాంతానికి చెందిన వంకల సత్యం(44) ఎస్.రాయవరం మండలం వాకపాడు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వారానికి ఒక సారి ఇంటికి వెళ్లి వస్తుంటారు. సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో స్వస్థలానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సరిగ్గా బయ్యవరం గ్రామ సమీపంలో ఉన్న హెరిటేజ్ పాల ఉత్పత్తి కేంద్రం వద్ద ఉన్న జంక్షన్ వద్దకు వచ్చేసరికి పక్క నుంచి నర్సింగబిల్లి పంచాయతీ చింతలపాలెం గ్రామానికి చెందిన అప్పారావు బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఈ క్రమంలో సత్యం మాస్టారు జాతీయ రహదారిపై పడిపోవడంతో వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ ఆయన పైనుంచి దూసుకుపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని జాతీయ రహదారి భద్రతా అధికారుల వాహనంలో అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు ప్రమాదానికి కారణమైన అప్పారావును, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మృతుడి మేనమామ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కాగా మృతుడికి భార్య స్రవంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

ప్రైవేటు స్కూల్ వద్ద తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ఆందోళన

- పాఠశాలను సందర్శించిన డీఈవో
- యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థుల కుటుంబ సభ్యులు



సాయిరాజ్ శరీరంపై స్కేల్ దెబ్బల ఆనవాళ్లు



పవన్ కృష్ణ ఒంటిపై దెబ్బలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విచక్షణ కోల్పోయి ఇద్దరు విద్యార్థులను ఓ ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్ స్టీల్ స్కేల్‌తో చితకబాదిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న డీఈవో అప్పారావునాయుడు స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు తగిలిన గాయాలను పరిశీలించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. స్థానిక గాంధీ నగరంలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న పవన్ కృష్ణ, షణ్ముఖ సాయిరాజ్ మధ్య శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో వాష్‌రూమ్ వద్ద వాగ్వాదం జరిగినట్టు ... మిగతా 8వ పేజీలో

24 లేదా 25న విజయవాడలో డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈనెల 24 లేదా 25వ తేదీన విజయవాడలో నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ నుంచి శనివారం జిల్లా విద్యా శాఖకు సమాచారం వచ్చింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 19న అమరావతిలో నియామక పత్రాలు అందజేయాల్సి ఉంది. అయితే అమరావతిలో వర్షాల కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈనెల 24 లేదా 25న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను విజయవాడ తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేయాలని ఉన్నధికారులు ఆదేశించారు. ఇందుకోసం సుమారు 300 మందికిపైగా టీచర్లు అవసరం. అయితే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 80 మంది టీచర్లను పంపించాలని ఆయా జిల్లాల డీఈవోలకు విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ లేఖ రాశారు. అభ్యర్థులను విజయవాడకు పంపేందుకుగాను విశాఖ విమల విద్యాలయంలో రిజిస్ట్రేషన్, తదితర విధులు నిర్వహించే టీచర్ల వివరాలను ఆదివారం సాయంత్రంలోగా పంపాలని లేఖలో పేర్కొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

» జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎం.వినోద్‌బాబు


మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎం.వినోద్‌బాబు

పాయకరావుపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇంటర్ వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎం.వినోద్‌బాబు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. వృత్తి విద్యా కోర్సు రికార్డులు.. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల తీరును పరిశీలించారు. వృత్తి విద్యాబోధన తదితర అంశాలపై ప్రిన్సిపాల్ కెశైలజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు ఐఐటీ, నీట్‌లో మంచి ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

'రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలి'

కోటవురట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ వివాదాలు పరిష్కారానికి శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. తహశీల్దార్ తిరుమలబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి శోభ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ రమేశ్ సమక్షంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మూడు గ్రామాల్లో రైతులకు సంబంధించి ఏడు భూ సమస్యలను ఇరువర్గాల వాదోపవాదాలు విన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడింటిలో ఒక సమస్య పరిష్కారం కాగా మిగతా ఆరు కేసు వాయిదాలు వేశారు. అనంతరం తహశీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ మండల లెవెల్ కమిటీ ఆధ్వర్యంలో భూ సమస్యలు పరిష్కారం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో డీటీ రమేశ్ పాల్గొన్నారు.

మెరక గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

నక్కపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ జగన్నాథపురం, దోసలపాడు, డొంకాడ మెరక గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. ఏవో ఉమా ప్రసాద్ నేతృత్వంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ వరి పొలాలను పరిశీలించారు. వరి పొలాల్లో ప్రస్తుతం మిత్ర పురుగులైన తూనీగలు, సాలె పురుగులు తగినంత వుండడం వల్ల రసాయన మందులు వాడకం అవసరం లేదన్నారు. ఏఈవో సత్యనారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం పశువైద్యులు డాక్టర్ విజయ్ రాజ్జీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆది వినాయకుని దర్శించుకున్న ప్రముఖులు


అన్నసమారాధన ప్రారంభించిన కాశీవిశ్వనాథం, రాము

మునగపాక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని శనివారం వేల సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్న శ్రీసత్యనారాయణ పిక్చర్ పాలెస్ అధినేత కొణతాల కాశీవిశ్వనాథం అన్నసమారాధనను ప్రారంభించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ మందపాటి శ్రీరామ వెంకట నరసింగరావు పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ములబంద గోడి రైతు సంఘం, శ్రీసిద్ధి వినాయక మహిళా సంఘం వంటా-వార్పుకు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాడి శ్రీరామ్మూర్తి, దొడ్డి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీ సేవలు సద్వినియోగం చేసుకోండి


జంపపాలెంలో డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ విధానాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఎలమంచిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూలీల కొరతను నివారించేందుకు వ్యవసాయ పనుల్లో డ్రోన్ సేవలను వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. శనివారం మండలంలోని జంపపాలెంలో పలువురు రైతులు 4 ఎకరాల్లో నానో యూరియాను డ్రోన్ ద్వారా పిచికారీ చేయించారు. డ్రోన్ సేవలను వినియోగింకోవాలని ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ కార్యాలయాధికారిని సంప్రదించాలన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలి

పాయకరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి జయప్రకాష్ లోక్‌నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి అధికారులు కృషిచేయాలన్నారు. పారిశుధ్యం మెరుగు, రక్షిత నీటి సరఫరా, వీధిలైట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుచేయాలని పోలీసులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ ఏఈలను కోరారు. సమావేశంలో తహశీల్దారు మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్, ఎంఈఓ రమేశ్ పాల్గొన్నారు.

1,564 డ్వాక్రా సంఘాలకు రూ.51.13 కోట్ల రుణాలు

పాయకరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గత ఆర్థిక సంవత్సరంలో 1,564 డ్వాక్రా సంఘాలకు రూ.51.31 లక్షలు బ్యాంకు లింకేజి రుణాలు అందజేశామని మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎ.రాణి తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వీటితోపాటు స్త్రీనిధి మహిళా బ్యాంకు ద్వారా 516 గ్రూపులలోని 2,355 మంది సభ్యులకు రూ.12.39 కోట్లు, సీఐఎస్, వీఆర్ఎఫ్ ద్వారా అర్హత కలిగిన 13 గ్రామ సంఘాలకు చెందిన 32 మందికి రూ.13.9లక్షలు అందజేశామన్నారు. డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన సున్నా వడ్డీ, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆర్.శ్రీనివాసరావు, ఎల్‌సీ రుత్తల శ్రీను, సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మునగపాకలో భారీ వర్షం

» హుద్‌హుద్‌ను తలపించిన ఈదురుగాలులు

» నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు

మునకగపాక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం హుద్‌హుద్ తుఫాన్‌ను తలపించింది.


మునగపాకలో ఈదురు గాలులతో వర్షం


మునగపాకలో వర్షానికి ఇళ్ల మధ్య చేరిన నీరు

భారీగా గాలులు వీస్తూ వర్షం కురవడంతో ప్రజలు భీతిల్లారు. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. చాలాచోట్ల వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్లు ఇళ్ల మధ్య వర్షం నిలిచిపోయి చెరువులను తలపించాయి. ప్రధాన రోడ్డు మార్గంలో కూలిపోయిన చెట్లను తొలగించేందుకు అధికార యంత్రాంగం పనులు చేపట్టింది. విద్యుత్ శాఖ సిబ్బంది పనులు చేపట్టారు.

ముందస్తు పరీక్షలతో ప్రాణాంతక వ్యాధుల గుర్తింపు

» గవర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు

మునగపాక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పలు రకాల ప్రాణాంతక వ్యాధుల గుర్తింపునకు స్క్రీనింగ్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట ఆరోగ్య సబ్ సెంటర్ వద్ద శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు డాక్టర్ వై.రామకృష్ణ పలు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడారి మంజు, భీమిశెట్టి కృష్ణారావు, కాండ్రేగుల జగన్, సూరిశెట్టి రాము, టీవీ రమణ, చూచుకొండ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో..

ఆరోగ్యకరమైన మహిళ శక్తివంతమైన కుటుంబాన్ని నిర్మించగలదని టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. శనివారం జల్లూరులో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మహిళలు, బాలికలకు రక్తహీనత, నోటి, సర్వైకల్ క్యాన్సర్, బీపీ, మధుమేహం గుర్తింపు పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామసర్పంచ్ లాలం పద్మావతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో అనంతకుమార్, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


తిమ్మరాజుపేట వైద్య శిబిరంలో మాట్లాడుతున్న భీమరశెట్టి శ్రీను

ఎలమంచిలిలో..

ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా మహిళలకు ప్రత్యేక ఆరోగ్య సేవలు అందిస్తున్నామని రేగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.శ్రావణి అన్నారు. శనివారం కొత్తలి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి రామలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలి బస్టాండ్‌ను విస్తరించాలి

రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరిన ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం/ఎలమంచిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి బస్టాండ్‌ని విస్తరించాలని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరినట్టు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ నేతలతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెప్పారు. ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్‌ను మరింత విస్తరించాలని అంతర్రాష్ట్ర సర్వీసులను ఎలమంచిలిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బస్టాండ్‌కి రాకుండా బైపాస్ మీదుగా వెళ్లిపోతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎలమంచిలి, అచ్యుతాపురం ప్రాంతాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్సులు నిర్మించి క్రీడాకారులకు అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ ఇప్పించేలా కోచ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని ప్రగడ నాగేశ్వర రావు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మునిసిపాలిటీకి చెందిన టీడీపీ నేతలు బొద్దపు రమణ, నమ్మి రమణ ఉన్నారు.


మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు


ఎలమంచిలి రావిచెరువు ఆవరణలో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరిపైనా ఉందని, అందుకు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకునేందుకు కృషి చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని రావిచెరువు గట్టు ప్రాంతంలో బీజేపీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి పట్టాభి ప్రసాద్ స్థానిక నేతలతో కలిసి రమాకుమారి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజారంజకంగా పాలన సాగిస్తున్నారన్నారు. బీజేపీకి రోజురోజుకు ఎనలేని ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు రాజాన సన్యాసినాయుడు, నేతలు ఆడారి శ్రీధర్, పిట్టా దానుబాబు, సుందరపు బాబ్జీ, మళ్ల కొండబాబు, పప్పు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

» రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు

రాంబిల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అన్నారు. మండలంలోని హరిపురంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ఆయన అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి.మనోహర్, ఈవోపీఆర్డీ రాజు, గ్రామ సర్పంచ్ ధూళి దేముడమ్మ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ధూళి అప్పలనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ ధూళి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి జి.గంగరాజు పాల్గొన్నారు.


హరిపురంలో అధికారులతో కలిసి మొక్క నాటుతున్న రాష్ట్ర యాదవకార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు

పాయకరావుపేట రూరల్‌లో..

ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని శ్రీరాంపురం పంచాయతీ కార్యదర్శి వైవీ. సత్యనారాయణ అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పేట బయ్యవరం గ్రామాల్లో ప్రత్యేకాధికారి ఎంఎస్ ప్రసాద్, ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, గ్రామ సెక్రటరీలతో కలిసి పరిసరాలు పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దీపిక, సెక్రటరీ సత్యనారాయణ, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లాస్టిక్ నివారించండి అని ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైవీ.రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. నక్కపల్లి సంపద కేంద్రం వద్ద ఎంపీడీవో డీ సీతారామరాజు, ఈవోపీఆర్డీ చలపతిరావు, సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం సంపద కేంద్రం వద్ద శ్రమదానం చేశారు. అనంతరం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు.

అచ్యుతాపురంలో..

ప్రజలంతా పారిశుధ్యం మెరుగు పరచాలని జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మడుతూరు ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. అలాగే తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ బి. సత్యనారాయణ మొక్కలు నాటారు. టీడీ శ్యామ్ కుమార్, మోటూరు త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తహశీల్దార్ పి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మండల రెవెన్యూ, పరిషత్ కార్యాలయాల వద్ద శనివారం ఎంపీడీవో ఎం.ఉషారాణితో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ప్రసాద్, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో..

పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం పాములవాక జడ్పీ హైస్కూల్, బీకేపల్లి, కోటవురట్ల గ్రామాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద రెండు మొక్కలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, బీకేపల్లి సర్పంచ్ పెట్లలింగం నాయుడు, పంచాయతీ కార్యదర్శి రఘురామ్, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్ అన్నారు. మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సిబ్బంది మండల కాంప్లెక్స్ ఆవరణలో తుప్పలు తొలగించి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గ్రామాల్లో మొక్కలు నాటాలన్నారు. ఎస్. రాయవరంలో ఆయన మొక్కలు నాటారు. గుడివాడలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


మడుతూరు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జనసేన నేత శ్రీవేణి


నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

బోధనలో నైపుణ్యత వుండాలి

నక్కపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తరగతి గదుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ వి.బాలాజీ సూచించారు. శనివారం మండలంలోని నక్కపల్లి, వేంపాడు, చినదొడ్డిగల్లు, గొడిచెర్ల, హైస్కూళ్లల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఎంఈవో -2 రుత్తల నాగన్నదొర ఈ సమావేశాలను పరిశీలించారు. ప్రతీ విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి : సీఐటీయూ

అచ్యుతాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పని గంటల పెంపు పద్ధతిని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని గంటల విధానంలో ప్రభుత్వం మార్పులు తీసుకురావడం శోచనీయమన్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ చట్టాలను సవరించారన్నారు. మహిళలకు రాత్రి డ్యూటీలు రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె. సోమునాయుడు, కర్రి నాయుడు, నాగేశ్వరరావు, పార్వతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు పాదయాత్రగా బయలుదేరిన భవానీలు


విజయవాడకు పాదయాత్రగా బయలుదేరుతున్న భవానీలు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తసోముదేవుపల్లికి చెందిన భవానీ భక్తులు శనివారం ఉదయం విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి పాదయాత్రగా బయలుదేరారు. శరన్నవరాత్రులను పురస్కరించుకొని అమ్మవారి మాలలను ధరించిన సీహెచ్ శేషు, బీఎస్ఎస్ రాజు, బి.నాగు, బి. వెంకటేశ్వరరావు, నాగరాజు విజయవాడకు పాదయాత్రకు పయనమయ్యారు. గురు భవానీలు భీమరాజు బాబూజీ, అన్నం శ్రీదేవి, భీమరాజు చిరంజీవిలతో పాటు టీడీపీ నేత ప్రగడ తులసి నాయుడు పాదయాత్రను ప్రారంభించారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు, ఎస్‌రాయవరం సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా గుడివాడ, లక్ష్మీపతి రాజుపేట, గుర్రాజుపేట, పెదఉప్పలం, కొరుప్రోలు, బంగారమ్మపాలెం, కొత్తపోలవరం, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లి, పాత సోముదేవుపల్లిల్లో శనివారం స్థానిక కూటమి నాయకుల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పెట్టుగోళ్లపల్లిలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, పాత సోముదేవుపల్లిలో టీడీపీ నేత ప్రగడ తులసి స్మార్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు.

సీడీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

మునగపాక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో బుద్ధ శివనాయుడు అన్నారు. మండలంలో గణపర్తి, మునగపాక జెడ్పీ హైస్కూళ్లో శనివారం జరిగిన క్లస్టర్ స్థాయిలో శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై శ్రద్ధ చూపాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో వేణుగోపాలరావు, హెచ్‌ఎంలు ఎం.శ్రీనివాసరావు, రోజామణి, అప్పారావు, శంకరరావు, సీఆర్ఎంటీలు కర్రి లక్ష్మీనారాయణ, బి.అచ్యుతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బాణాల పండుగ


కొడవటిపూడిలో బాణాల పండుగ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోటవురట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిపూడి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు దసరా పండుగ సందర్భంగా బాణాల పండుగాను ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థులు రాముడు, సీతా, లక్ష్మణుడు, ఆంజనేయుడు వేషధారణలతో బాణాలను పట్టుకొని ఇంటింటికి తిరిగి పాటలు పాడుతూ కానుకలు సేకరించారు. బాణాలతో తంగేడు పూలను ఇళ్లలోకి వేయడంతో కుటుంబ సభ్యులు వచ్చి విద్యార్థులకు కానుకలు వేశారు. హెచ్‌ఎం ప్రతాప్ కుమార్, ఉపాధ్యాయులు సంప్రదాయాలను తెరపైకి మళ్లీ తెచ్చారు.


సమావేశంలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు... (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పీ4 అమలులో కీలకపాత్ర పోషించండి

▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమం అమలులో గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పట్టణంలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం పీ4 కార్యక్రమంపై జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ శిబిరంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ4 కార్యక్రమంలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు సచివాలయ ఉద్యోగులే మార్గదర్శకులుగా, సంధానకర్తలుగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా పీ4 కార్యక్రమానికి అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి, వారిని మ్యాపింగ్ చేయాలన్నారు. మార్గదర్శులు ముందుగా బంగారు కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. వారికి కావాల్సిన అవసరాలను గుర్తించి తీర్చగలిగే మార్గదర్శకాలు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే పీ4 కార్యక్రమానికి అర్హత కలిగి మిగిలిపోయిన కుటుంబాలకు కొత్త మార్గదర్శకులను నియమించాలన్నారు. సమావేశంలో సీపీవో జి.రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


సంపద కేంద్రంలో ఎరువులు వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మండలంలోని గొలగాం గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సంపద కేంద్రం చుట్టూ మొక్కలు నాటారు. సంపద తయారీ కేంద్రం కార్యకలాపాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు. మెరుగైన జీవ ప్రమాణాల సాధనకు, ఆరోగ్యంగా ఉండడానికి పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి సుబ్బలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్ పాల్గొన్నారు.

అన్ని పోలీసు స్టేషన్లలో స్వచ్ఛత కార్యక్రమం


జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పరిశుభ్రం చేస్తున్న పోలీసులు

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ దేవప్రసాద్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శనివారం పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మరిగించిన, శుద్ధి చేసిన నీటిని తాగాలని, బయట ఆహారాన్ని నివారించాలని ఈ సందర్భంగా ఏఎస్పీ సూచించారు. అలాగే దోమలు వృద్ధి చెందకుండా ఉండడానికి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అంటువ్యాధుల నివారణకు ఫాగింగ్ కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు బెండి వెంకటరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా వేడుకలు


దుర్గమ్మ వేషధారణలో చిన్నారులు

తుమ్మపాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాలలోని పాఠశాలలో శనివారం ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. చిన్నారులు దుర్గాదేవి అమ్మవారి వేషధారణల్లో అలరించారు. భారత సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, భక్తిభావాలను కలిగి జీవించాలని ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గిరిశ్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, రిటైర్డ్ నీటిపారుదల శాఖ ఏఈ మళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిపాలేన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న రాంకీ

తుమ్మపాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మామిడిపాలెం గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రముఖ వ్యాపారవేత్తలు సమకూర్చిన స్టీల్ నీటి సీసాలు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు. ప్రధానంగా తమ తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి పరదేశినాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త అంజని చౌదరి, నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు, జి.జగదీశ్, బి.అప్పలనాయుడు, చెక్కల శ్రీను, కె.అప్పలనాయుడు, ఎ.శ్రీను పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ప్రోత్సాహం

సబ్బవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల విద్యాలయంలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు తహశీల్దార్ చిన్నికృష్ణ ప్రోత్సాహాలు అందించారు. జాతీయ టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన పి.సాగర్‌ను అభినందించి టీ షర్టు, షూస్, రూ.2500 నగదు అందించినట్టు ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ తెలిపారు. అలాగే 50 మంది పేద విద్యార్థులకు దుప్పట్లు అందించినట్టు చెప్పారు. గురుకుల విద్యార్థుల పట్ల తహసీల్దార్ ఔదార్యం చాటుకున్నారని ఆయన పేర్కొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు ఆలయాల ముస్తాబు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శరన్నవరాత్రి వేడుకలకు నూకాంబిక, సతకంపట్టు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా నూకాంబిక అమ్మవారి


నూకాంబిక ఆలయ ఆవరణలో పందిరి... (ఇన్‌సెట్‌లో) నూకాంబిక అమ్మవారు

కనకదుర్గమ్మ, నూకాంబిక ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

ఆలయంలో 11 రోజుల పాటు వేడుకలను నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి తెలిపారు. భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుగుతాయన్నారు. అక్టోబరు మూడో తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. దసరా సందర్భంగా ఆలయానికి ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ సహాయ కమిషనర్ చెప్పారు.

అలాగే సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దడమే కాకుండా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పందిర్లు ఏర్పాటు చేశారు. ఆలయ శాశ్వత ఛైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒక్కొక్క రోజు ఒక్కో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం కల్పిస్తామని నాయుడు, రమణ


ఉత్సవాలకు సిద్ధం చేసిన సతకంపట్టు దుర్గమ్మ ఆలయం... (ఇన్‌సెట్‌లో) కనకదుర్గమ్మ

తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌తో ఆరోగ్యానికి రక్షణ

▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ హైమావతి

కొత్తూరు, సెప్టెంరు 20 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌తో మహిళల ఆరోగ్య రక్షణ భరోసా కలుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ హైమావతి చెప్పారు. అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం డీబీ కాలనీలో శనివారం జరిగిన వైద్య శిబిరాలను, అవగాహన సదస్సులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వ్యాధులను ముందుగా గుర్తించడంతో పాటు వాటిని పూర్తిగా అదుపు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మహిళల్లో అవగాహన లేకపోవడంతో వ్యాధుల తీవ్రత పెరిగిన తరువాత గుర్తించడం జరుగుతోందన్నారు. దీంతో పూర్తిస్థాయిలో అదుపు సాధ్య కావడం లేదని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అక్కడే పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే ఆసుపత్రుల్లో చికిత్స చేయిస్తామన్నారు. తరువాత దశలో నాలుగైదు గ్రామాలకు కలిపి ఉన్నతస్థాయి వైద్య పరీక్షా శిబిరాలు ఏర్పాటు


డీబీ కాలనీలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖరదేవ్, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ ఎస్తేరు రాణి, నోడల్ అధికారి డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ యశోద, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు

కొత్తూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో శనివారం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు జరిగాయి. ఈ పోటీలను కళాశాల యాజమాన్యం అధ్యక్షుడు శ్రీధరాల కృష్ణపేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు, ప్రిన్సిపాల్ జయబాబు, డీఐఈవో ఎం.వినోద్‌బాబు ప్రారంభించారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, మూడు కిలోమీటర్లు, నాలుగు కిలోమీటర్లు, ఆరు కిలోమీటర్లు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, లాంగ్ జంప్, త్రిపుల్ జంప్, హైజంప్, రగ్బీ పోటీలు అండర్-19 బాలబాలికలకు జరిగాయి. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని విశాఖ జిల్లా అథ్లెటిక్ అండర్-19 జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన టీములు ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ పోటీలు విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వీఏ.పుష్పలత, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీలక్ష్మి, ఉమ, సాగర్, తరుణ్, ప్రసాద్, సావిత్రి, డాక్టర్ కేవీఎస్.నాయుడు, సావిత్రి, కె.శత్రుఘ్ను


పోటీలు ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కమిటీ సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, యు.కృష్ణకిశోర్, పి.వి.సుధాకర్, ఏ.నూకయ్యనాయుడు, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు

పరవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్లోబల్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగం బాలురుకు, పరవాడ ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాలికలకు జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీలు శనివారం నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తొలుత పోటీలను సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కేఎం.నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులుగా ఎంవీ నాగేశ్వరరావు వ్యవహరించగా, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు

ఎన్టీఆర్ వైద్యాలయంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యాలయంలో శనివారం స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. స్వచ్ఛత పాటిస్తే వ్యాధులు దూరమని ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి పేర్కొన్నారు. వైద్యులు స్వచ్ఛంధ్రాకు అందరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే డీఎంహెచ్‌వో వైద్యాలయం ఆవరణలో మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. చెత్తను రోడ్ల మీద వేయకూడదని, తడి, పొడి చెత్తను గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో కార్యాలయ ఎస్‌వో ఆర్.రామచంద్రరావు, వీరునాయుడు, ఎస్.రమణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన పెన్‌డౌన్

కొత్తూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెండో రోజు శనివారం కూడా పెన్‌డౌన్ కార్యక్రమం కొనసాగింది. ప్రభుత్వ నూతన విధానాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని దస్తావేజు లేఖర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అయోధ్య శేషు, ఆనంద్ ప్రసాద్, వెంకట గుణాజీరావు, గల్లా కొండలరావు, ఆళ్ల బాల, అల్లు పోతురాజు, మద్దాల రవికుమార్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ బొంకుల దిబ్బయూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, బొంకులదిబ్బయూత్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా అప్పారావు, చల్లా కనకారావు, బొంకులదిబ్బయూత్ అసోసియేషన్ ప్రతినిధులు పైలా హరీశ్, లాలం ముత్యాలనాయుడు, పైలా పైడంనాయుడు, చీపురుపల్లి శ్రీనివాసరావు, గండి గణేష్, గండి వాసు, చిరికి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రైతులకు మెరుగైన సేవలు

▸ సహకార సంస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

▸ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

సబ్బవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు తెలిపారు. శనివారం స్థానిక దుర్గమాంబ పీఏసీఎస్‌లో ఛైర్‌పర్సన్ గండి దేముడు అధ్యక్షతన రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీల్లో అవకతవకలను అడ్డుకునేందుకు రాష్ట్రంలో 2,239 సహకార సంస్థలను కంప్యూటరీకరణ చేయడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సహకార సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. జాతీయ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి పాస్‌పుస్తకాలపై రుణాలను ఎకరాకు రూ.10 లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల ప్రమాద బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.30 వేలు నుంచి రూ.లక్ష చెల్లించేలా చర్యలు చేపట్టామన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లఫారాలు పెట్టుకునే రైతులకు 50 శాతం రాయితీపై రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. చదువుకునే రైతు బిడ్డలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామన్నారు. అనంతరం రైతులకు రుణాల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ని నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, నోడలాఫీసర్ ఎంవీవీ కిశోర్, ఈవో గొంప రమణ, డైరెక్టర్లు పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావు, కూటమి నేతలు భరణికాన బాబూరావు, గండి ముత్యాలనాయుడు, కొటాన అప్పారావు, కరణం రామునాయుడు, బొండా కళ్యాణ్, రామకృష్ణరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిని సందర్శించిన రీజనల్ డైరెక్టర్ సిన్హా


సింహాద్రి అధికారులతో రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ఈడీ) అరిందం సిన్హా

పరవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)ని రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ఈడీ సౌత్) అరిందం సిన్హా శనివారం సందర్శించారు. తొలుత ఈడీ సమీర్‌శర్మ ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఆర్ఈడీ కంట్రోల్ రూము, ప్లాంట్ ప్రాంగణంలోని కీలక ప్రాంతాలను సందర్శించారు. అక్కడ కార్యకలాపాలను ఆర్ఈడీకి సింహాద్రి వివరించారు. ప్లాంట్ పురోభివృద్ధికి అధికారులంతా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆర్ఈడీ అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలి: సీఐ

పరవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. పెదముషిడివాడ హైస్కూల్‌లో శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. ఈ అవగాహన సదస్సులో పాఠశాల హెచ్ఎం కె.కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి'

తుమ్మపాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అమెరికాలో సిల్కాన్ వ్యాలీ మాదిరిగా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఆవిష్కరణ కానుందని చెప్పారు. 50 ఎకరాల్లో 4400 కోట్ల రూపాయలతో ఐబీఎం టీసీఎస్, ఎల్‌అండ్‌టీ కంపెనీలు కలిసి చేపట్టబోయే క్వాంటమ్ వ్యాలీ ఇండియాకు గేమ్ చేంజర్‌గా కాబోతుందని ఆయన తెలిపారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా అమరావతి మారేందుకు సీఎం చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

తుమ్మపాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారి లచ్చన్న పేర్కొన్నారు. జిల్లా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మండల కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మార్కెటింగ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఇలాంటి తరుణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందించడం ద్వారా ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ జిల్లా అధికారి వర్మ, జిల్లా కోఆర్డినేటర్ గోవింద్, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వెదురుపర్తి విద్యార్థి


వైట్ కిశోర్

కశింకోట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మార్టూరులో అండర్-14 బాయ్స్ అండ్ గర్ల్స్ ఉమ్మడి విశాఖ జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికల్లో కశింకోట మండలం వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న వైట్ కిశోర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు కేఆర్ఎస్ఎన్.నాయుడు తెలిపారు. ఈ ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు కిశోర్‌కు అభినందనలు తెలిపారు.

23 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 23 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గొల్లవీధి, భీమునిగుమ్మం, నరసింగరావుపేట, మిరియాలకాలనీ, శ్రీరామనగర్, గాంధీనగరం, వేల్పులవీధి, సతకంపట్టు, అరుంధతినగర్ సచివాలయాల్లో ఈ నెల 26వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు అందుబాటులోకి ఉంటాయని చెప్పారు. ఈ శిబిరాలను ప్రజలు వినియోగించుకొని ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఈపీడీసీఎల్ ఉద్యోగుల దీక్షలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈపీడీసీఎల్ ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఈపీడీసీఎల్ విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) కార్యదర్శి అనకాపల్లి నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షల్లో బీవీజీ శంకర్, డీఎస్ రాంబాబు, బి.కూర్మారావు, పి.యర్రయ్యనాయుడు, ఎం.గోపాలరావు, ఎం.ఆదినారాయణ, ఎస్ఎస్‌డీ సత్యారావు, పి.రాజు, సీహెచ్‌వీ రమణరాజు, ఎం.రమణ కూర్చొన్నారు. వీరికి ఉద్యోగులతో పాటు సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

డైట్‌లో గురజాడ అప్పారావు జయంతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో అభ్యుదయ పితామహుడు గురజాడ వెంకటఅప్పారావు జయంతి శనివారం జరిగింది. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ గణేష్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గురజాడ విశిష్టతను తెలియజేశారు. గురజాడ చేసిన రచనలు ఈనాటికి ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

అక్కినేనికి ఘన నివాళులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతిని పరమేశ్వరి పార్కు జంక్షన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని చిత్రపటానికి అక్కినేని అభిమాన సంఘాల నాయకుడు, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కినేని వల్ల సినీ పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడిందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు ఆడారి ఆదిమూర్తి, కొణతాల పూర్ణ చంద్రరావు, పొలమరశెట్టి చందు, కేఎం నాయుడు, గోల్డ్ వాసు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ


పాడేరు మెడికల్ కాలేజీలో మొక్కలు నాటుతున్న వైద్యాధికారి


చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న ర్యాలీలో ఎంపీపీ అధికారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ
- వాడవాడలా 'గ్రీన్ ఆంధ్రప్రదేశ్'

పాడేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ అన్నారు. ఈనెల మూడో శనివారం పురస్కరించుకుని స్వచ్ఛాంధ్రలో భాగంగా మండలంలో కాడెలి గ్రామంలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ మనుగుడకు ఎంతో ముఖ్యమైన పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ రక్షించాలన్నారు. అందుకు గానూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. మన్యంలోని పర్యావరణ పెంపుతోపాటు గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం లక్ష ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ... మన్యంలోని పర్యావరణ పరిక్షణలో భాగంగా ప్రభుత్వం దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లను అందిస్తోందన్నారు. కాడెలి పాఠశాల ఆవరణలో అధికారులు, ప్ర జా ప్రతినిధులు పలు మొక్కలను నాటారు. గ్రామ సచివాలయాల నోడల్ అధికారి పీఎస్.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డ్వామా పీడీ విద్యాసాగర్, డీఈవో బ్రహ్మాజీరావు, ఎంఈవో మోరి జాన్, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, పీఏసీ ఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జి.మాడుగుల : స్థానిక ఎంపీపీ అప్పలరాజు, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు విజయ్‌కుమార్, అధికారులు విజయ్‌కుమార్, ఏపీవో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో అవగాహన ర్యాలీ చేపడుతున్న దృశ్యం

అనంతగిరి: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు పిలుపునిచ్చారు. మండలంలోని వేంగడ గ్రామంలో లంగుపర్తి వైద్యాధికారి మంజుభార్గవి, రాకేశ్ మహిళలకు శనివారం వైద్యసేవలందించారు. మొక్కలు నాటారు. సర్పంచ్ సీమ, పీహెచ్ఎన్. పి.వెంకటలక్ష్మి, కార్యదర్శి శ్యామ్, రాజారావు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పశువైద్యశాల పరిసరాలను వైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు ఆధ్వర్యంలో పరిశుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒకరూ మొక్కలు నాటాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో హరిత ఆంధ్ర కార్యక్రమాన్ని మండల పరిషత్ అధికారులు నిర్వహించారు. పాత బస్ స్టాండ్ నుంచి ఏపీ గురుకుల కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఏపీ గురుకుల కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, ఎంఈవో పీబీవీవీవీ ప్రసాద్, ఏపీవో రాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, కూటమి నాయకులు నాగభూషణం, బుజ్జిబాబు, సుర్లవీరేంద్ర, మధు,పాల్గొన్నారు.

పాడేరురూరల్: పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యం సాధ్యమని డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌వీఎస్.రమేశ్ అన్నారు. పాతపాడేరులో పంచాయతీ సిబ్బంది, స్థానిక ఉద్యోగులతో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రా మంలో భారీ ర్యాలీని చేపట్టారు. వార్డు మెంబర్ శంకరరావు, పెసాకమిటీ సభ్యుడు కె.రాధాకృష్ణ నాయుడు, సచివాలయ సిబ్బంది నరేశ్‌కుమార్, రంజిత్‌కుమార్, సత్యవతి, మత్స్యకొండమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో....

స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలత దేవి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.పాపరత్నం, ఫ్యాకల్టీమెంబర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో ధర్మారావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏవో మురళీకృష్ణ ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం కళావతి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో 350 సీట్లు భర్తీ

పాడేరురూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తొలివిడత ప్రవేశాలు చేపడతున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి కళాశాలలో ఉన్న 560 సీట్లకు మొదటి విడతగా శనివారం సాయంత్రానికి 350 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. బీఏ హిస్టరీలో 55 సీట్లకు 41 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. పాలిటిక్స్‌లో 35 సీట్లకు 20, స్పెషల్ ఇంగ్లీషు 45కి 39, స్పెషల్ తెలుగు 37కి 30, బీకాం జనరల్ 31కి 23, బీకాం ఒకేషనల్ 66కి 59, బీఎస్సీ ఫిజిక్స్ 20కి 13, బీఎస్సీ కెమిస్ట్రీ 18కి 16, బీఎస్సీ జువాలజీ 45కి 32, బీఎస్సీ బోటనీ 55కి 43, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపునకు 47 సీట్లు కేటాయించగా, 34 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. మొదటి విడతలో సీట్లు లభించిన విద్యార్థులకు 22వ తేదీ సోమవారం వరకు అడ్మిషన్‌లకు అవకాశం ఉందన్నారు. 21వ తేదీ ఆదివారం కళాశాలకు వచ్చినా అందుబాటులోనే ఉంటామని ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికులతోనే ప్రజారోగ్యం

- జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులతోనే సమాజంలోని ప్రజారోగ్య మెరుగ్గా ఉంటుందని టీడీపీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. పాడేరులో శనివారం పారిశుధ్యకార్మికుల కోసం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటనే పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయగలుగుతారన్నారు. ఈ స్థితిలో వారి ఆరోగ్య రక్షణకు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ.. పారిశుధ్యకార్మికులు సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈసందర్భంగా స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు వైద్యులు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, పీఏసీఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, ఐటీడీపీ అధ్యక్షుడు బుద్ద జ్యోతికిరణ్, సర్పంచులు పాంగి పాండురంగ స్వామి, లకే పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జీసీసీ చైర్మన్, పక్కన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

స్వస్థ్ నారీ సశక్త్‌ను సద్వినియోగం చేసుకోండి


వంతమర్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొయ్యూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రపాలెం పీహెచ్‌సీ పరిధి బూదరాళ్ళ పంచాయతీ వంతమర్రి గ్రామంలో వైద్యాధికారి హేమంత్ చౌదరి ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 112 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ప్రశాంత్‌కుమార్, హెచ్‌వీ భూలోక, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఏఎన్ఎం వలరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి. ప్రతాప్ తెలిపారు. శనివారం పెదబయలు మండలంలోని గోమంగి పీహెచ్‌సీలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. 135 మంది రోగులకు వైద్య సేవలందించారు. అనంతరం జడ్పీటీసీ సభ్యుడు, స్థానిక నాయకులతో కలిసి ఆయన పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలను నాటారు. పీహెచ్‌సీ ముఖ ద్వారం వద్ద కూరగాయల స్టాల్‌ను సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో భూలోకం, వైద్యాధికారి చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు..

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి: ఏబీవీపీ

పాడేరురూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు శనివారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిమళకు వినతిప్రతమిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.చిన్నబ్బాయి, జిల్లా కన్వీనర్ తిరుపల్లి యోగి మాట్లాడుతూ, ఈ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చిన్నారుల తల్లిదండ్రుల సమాచారం మేరకు శనివారం పాఠశాలను సందర్శించామన్నారు. మెనూ సరిగా అమలు చేయడంలేదన్నారు. పెదబయలు మండలం గోమంగి గురుకుల పాఠశాల వ్యవహారంపై విచారణ చేపట్టాలని కోరారు.నాయకులు కృష్ణమూర్తి, సంజయ్‌కుమార్, వెంకట్, సాగర్, రామ్‌చరణ్, పాల్గొన్నారు.

జెన్‌కో కాంట్రాక్టు కార్మికుల ఆందోళన


సీలేరులో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

సీలేరు, సెప్టెంబరు 20 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కోలో కాం ట్రాక్టు అవుట్ సోర్సింగ్ పీసురేట్ కార్మికులు శనివారం తమ సమస్యలపై ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా జెన్‌కోలో చాలీచాలని జీతాలతో పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత ఎస్‌కె సుభాన్, కాంట్రాక్టు కార్మికుల నాయకులు టి విష్ణుకుమార్‌రాజు, బి లక్ష్మణ్, ఎం రమణ పాల్గొన్నారు.

జెన్‌కో ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

సీలేరు: సెంట్రల్ విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు జీకేవీధి మండలం సీలేరులో జెన్‌కో ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. జెన్‌కో ఉద్యోగులు బనాడ శివ, డి. వెంకటేశ్వరరావు, ఎం కృష్ణయ్య, కాంట్రాక్టు కా ర్మికుడు అప్పలరాజు శనివారం దీక్షలో కూర్చున్నారు. వీరికి జేఏసీ నాయకులు వై సత్తిబాబు, వై దార్రాజు, అకౌంట్స్ ఆఫీసర్ ఈవీవీ సత్యనారాయణ, జీ శివప్రసాద్ ఎస్ నాగేశ్వరరావు, జీ సుకుమార్, టి బుట్టో, తదితర నాయకులు సంఘీభావం తెలిపారు.

ఇళ్ల నిర్మాణంలో సమస్య పరిష్కారానికి చర్యలు: పీడీ


జలగలగెడ్డలో ఆదివాసీలతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బాబునాయక్

చింతపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి పంచాయతీ జలగలగెడ్డ గ్రామంలో ఆదివాసీలు పక్కా గృహాల నిర్మాణంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హౌసింగ్‌శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబూనాయక్ అన్నారు. శనివారం గ్రామాన్ని సందర్శించి ఆదివాసీల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామంలోని ఆదిమజాతి ఆదివాసీలకు పీఎంజన్‌మన్ పథకంలో 14పక్కా గృహాలను మంజూరుచేశామన్నారు. రహదారి సదుపాయంలేక ఆదివాసీలు ఇళ్ల నిర్మాణ సామగ్రి తరలింపులో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ స్థితిలో ఐటీడీఏ పీవో శ్రీపూజ ఆదేశాలతో గ్రామాన్ని సందర్శించామన్నారు. సమస్యలను కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్లు రమణబాబు, రాజారావు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యం'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనంతగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా పనిచేయాలని, టీడీపీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని శివలింగపురం మౌంటెన్ వ్యూ రిసార్ట్ వద్ద టీడీపీ కార్యకర్తలు, నాయకులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు కొట్యాడ అప్పారావు, బుజ్జిబాబు మాట్లాడుతూ.. స్థానిక సంస్థ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు ఏకతాటిపై కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, నాయకులు గాలి నరేంద్ర, ఎస్.డొన్ను, పి.నిర్మల, బి.లక్ష్మణ్‌రావు, పాల్గొన్నారు.

'రేషన్ డిపోను మార్చండి'

కొయ్యూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలకజీడి (03డి) డీఆర్ డిపో నుంచి గూడెం మండలం పీకె గూడెం డిపోనకు తమ రేషన్ కార్డులు మార్చాలని మఠం బీమవరం పంచాయతీ మందపల్లి వాసులు కోరారు. ఈ మేరకు వారు శనివారం సివిల్ సప్లై డీటీకు వినతిని అందచేశారు. గ్రామంలోని లబ్ధిదారులు ప్రతీ నెలా రేషన్‌కు 38 కిలోమీటర్లు దూరంలోని పలకజీడికి వెళ్లాల్సి వస్తోందన్నారు. అందువల్ల 7 కిలోమీటర్ల దూరంలోని జీకే వీధి మండలం పీకే గూడెంనకు రేషన్ కార్డులు మార్చాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

జి.మాడుగుల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళుతున్న సచివాలయ సిబ్బందికి గడుతూరు పంచాయతీ నాయకులు సర్పంచ్ కె.అప్పమ్మ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మా, టీడీపీ నాయకులు కె.సింహాచలం, చిన్నయ్య, ఆనంద్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందికి సన్మానం చేస్తున్న నాయకులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై గిరిజనుల ఆగ్రహం

అరకులోయ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హైడ్రోపవర్ ప్రాజెక్టుకు అనుమతులపై గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం సుమారు నాలుగు వేల మందికి పైగా గిరిజనం అరకులోయలో మహాగర్జన పేరుతో నిరసన ర్యాలీ చేపట్టారు. మరోవైపు హైడ్రోపవర్ ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలైన హుక్కుంపేట మండలం భూర్జ, మజ్జివలసలను టీడీపీ అరకు ఇన్‌చార్జి, విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర, పార్టీ నేతలతో కలిసి శనివారం సందర్శనకు వెళ్లారు. భూర్జ గ్రామంలో హైడ్రోపవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకతతో ఉన్న గిరిజనులు దొన్నుదొర బృందాన్ని చుట్టుముట్టారు. నినాదాలతో మార్మోగించారు. సుమారు గంటపాటు ప్రభుత్వం హైడ్రోపవర్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని, లేకుంటే దొన్నుదొర, టీడీపీ నేతలను విడిచిపెట్టేదిలేదని భీష్మించారు. అనంతరం దొన్నుదొర, టీడీపీ నేతలు హైడ్రోపవర్‌ప్రాజెక్టు అనుమతులు గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుపై గిరిజనుల్లో ఉన్న వ్యతిరేకతను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని దొన్నుదొర హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు శాంతించారు. అలాగే, అరకు పోలీసులు జరిగిన ఈ సంఘటన తెలుసుకుని వారి సూచనలపై దొన్నుదొర, ఇతర నాయకులు పర్యటన ముగించుకుని అరకులోయకు సాయంత్రానికి తిరిగి వచ్చారు

జీవో ప్రతులు దహనం

హుకుంపేట: హైడ్రో పాజెక్టు అనుమతులకు సంబంధించి జీవో రద్దు చేయాలని మండల పెసా కమిటీ సభ్యులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ మేరకు తీర్మాన కాపీని ఎంపీడీవోకు అందించారు. జీవో 51 జీవో పత్రాలు దహనం చేశారు. ఈ సందర్భంగా పెసా కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు చిరంజీవి, రామకృష్ణ, అప్పలకొండ, శంకర్ తదితరుల పాల్గొన్నారు.


దొన్నుదొర, టీడీపీ నేతలను చుట్టిముట్టి నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

పశువులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు: పీవో


కోర్రాయిలో పట్టుకున్న పశువుల వద్ద ఐటీడీఏ పీవో శ్రీపూజ

డుంబ్రిగుడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ హెచ్చరించారు. శనివారం కొర్రాయి గ్రామ సమీపంలో 4లారీల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను గుర్తించి పట్టుకున్నారు. 114 పశువులను స్థానిక తహసీల్దార్, ఎస్ఐ పాపినాయుడు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయక ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వరరావు, ఎస్ఐ పాపినాయుడు, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే పునాది: డీఈవో


మత్స్యపురం పాఠశాల పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

హుకుంపేట సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):పిల్లలకు ప్రాథమిక స్థాయిలో సంపూర్ణ విద్యా అందించాలని డీఈవో బ్రహ్మాజీ తెలిపారు శనివారం మండలంలోని మత్స్యపురం పాఠశాల ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం, తరగతి గదులు ఎస్ఏవన్ పరీక్ష, అసెస్‌మెంట్ బుక్స్‌ను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు ఆటపాటలతో ఆకట్టుకునేలా బోధించాలన్నారు. అక్షర జ్ఞానం కలిగితే పెద్దయితే మరింత చదువుకు వీలవుతుందన్నారు. పిల్లలకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గురుపల్లి ప్రాథమిక పాఠశాల ఆకస్మిక సందర్శన

పాడేరు: మండలంలో గురుపల్లి ప్రాథమిక పాఠశాలను డీఈవో పి.బ్రహ్మాజీరావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన నిర్వహణ, విద్యార్థులకు పఠనాసక్తి, తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యలో వెనుకబాటులో ఉన్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారంమధ్యాహ్నం భోజనం పెట్టాలని డీఈవో సూచించారు. ఎంఈవో మోరి జాన్, సీఆర్పీ బిందు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడు సాయిరామ్‌నకు సన్మానం


ఎస్టీ కమిషన్ సభ్యుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులై శనివారం పాడేరు పర్యటనకు వచ్చిన కిల్లో సాయిరాంను టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి ఆధ్వర్యంలో నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాండురంగస్వామి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఈ పదవిని గిరిజన ప్రాంతంలో చట్టాలు, హక్కులు పరిరక్షణకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. అభివృద్ధికి, ప్రజా ప్రయోజనాల దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు సాగర సుబ్బారావు, పాడి అచ్చులమ్మ, పలాసి శశిభూషణంనాయుడు, పాడి బాలన్న, త్రినాథ్, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ డిప్లొమాతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆళ్ల అప్పలస్వామి, అధ్యాపకులు

చింతపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమా అభ్యసించిన విద్యార్థులకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. శనివారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో చింతపల్లిలో మాత్రమే సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఉన్నదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సేంద్రీయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ పెరిగిందన్నారు. ఈ మేరకు సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సును అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తాయన్నారు. అగ్రిసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి ఏజీబీఎస్సీలో సీటు సాధించడం లక్ష్యంగా చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త, ఓఎం డాక్టర్ కె. బాలహుస్సేన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ డి. వెంకటేశ్‌బాబు, బీఎన్ సందీప్ నాయక్, పి. జోగారావు పాల్గొన్నారు.

విద్యార్థినుల దండనపై ఆందోళన


గోమంగి మినీ గురుకులం గేటు వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, నాయకులు

పెదబయలు, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి):గోమంగి గురుకులంనుంచి 16 మంది విద్యార్థినులువెళ్లి పోవడంపై ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 18న పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థినులపై ప్రిన్స్‌పాల్ వసంతకుమారి కర్రతో దండించడంతో పాఠశాల వారు వదిలి సమీప గ్రామాల్లో వెళ్లపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం గోమంగి మినీ గురుకుల పాఠశాలలో ఎత్తున ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్స్‌పాల్ వసంతకుమారి విద్యార్థులను తాను కొట్టలేదని మందలించడం మాత్రమే జరిగిందని ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పుష్ప జోసెఫ్, ఏటీడబ్ల్యూ స్వర్ణలత, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రమణ నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండలో విలీనం చేయాలని వినతి


నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జికి వినతి ఇస్తున్న కంఠారం, బాలారం పంచాయతీల ప్రజలు

కొయ్యూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలారం, కంఠారం గ్రామాలను అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలో విలీనం చేయాలని జనసేన నర్సీపట్నం నియోజక వర్గ ఇన్‌చార్జి రాజాన సూర్య చంద్రకు ఆయా గ్రామాల వారు వినతిని అందజేశారు. శనివారం నర్సీపట్నంలో సూర్యచంద్రను కలసి తమ గోడును వెల్లబోసుకున్నామన్నారు. 1886కు పూర్వం తాము గొలుగొండ తాలూకాలో తాము ఉండేవారమని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం జరిగిన పరిణామాల్లో కొయ్యూరు మండలంలో విలీనం చేశారని నాటి నుంచి రెవెన్యూ, భూ సంబంధ తదితర పనులకు తీవ్ర వ్యయప్రయాసలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం వెళ్లాలంటే గొలుగొండ మీదుగా 39 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటున్నదన్నారు. ఈ స్థితిలో తమ గ్రామాలను గొలుగొండలో విలీనం చేసేలా పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూర్యచంద్రను వారు కోరారు.

'ఆదివాసీ నిరుద్యోగుల అరెస్టు తగదు'

పాడేరురూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్, శతశాతం రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్లతో శాంతియుత ఆందోళనకు సిద్ధమైన నిరుద్యోగులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సాలూరులోని గిరిజన సంక్షేమశాఖ మంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడికి వెళితే వారిని అక్రమంగా అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. అక్రమంగా గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, నిరుద్యోగ సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.సత్యనారాయణ, నాయకులు రాజు, స్వాతి, శివ, భాను, రాముతో పాటు 50 మందిని అరెస్టు చేశారన్నారు.

వాడవాడలా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



గొలుగొండ: రావణాపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ వనిత, వైద్య సిబ్బంది

మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి చర్యలు

- చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారిణి వనిత
- గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ శిబిరాలు

గొలుగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి వనిత చెప్పారు. మండలంలోని రావణాపల్లి గ్రామంలో శనివారం గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్, స్థానిక నాయకుడు సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాపయ్యపాలెం, జి.వెంకటాపురం గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్యులు చరిష్మా, సీతామహాలక్ష్మి మాట్లాడుతూ మహిళలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమన్నారు. రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన మందులు, ఆహారం గురించి వివరించారు. సుమారు 300 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సుబ్బలక్ష్మి, సర్పంచ్ మేరీ పాల్గొన్నారు.

నాతవరంలో...



నాతవరం: గన్నవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నాతవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు ఉపయోగించుకోవాలని గునుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చక్రధర్ కోరారు. మండలంలోని గన్నవరం గ్రామంలో శనివారం మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మహిళలకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రధర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంటి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నర్సీపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో శనివారం వాడవాడలా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సీపట్నంలో మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. మునిసిపల్ రోడ్డులో స్థానికులతో కలిసి శుభ్రం చేసి మొక్కలు నాటారు. వీటిని పరిరక్షించే బాధ్యతను స్థానిక మహిళలకు అప్పగిస్తూ దత్తత ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పాల్గొన్నారు. అలాగే నర్సీపట్నం అటవీశాఖ కార్యాయంలో రేంజ్ అధికారి కేవీ రాజేశ్వరరావు, ఆర్టీసీ డిపో ఆవరణలో జిల్లా ప్రజా రవాణా అధికారిణి ప్రవీణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి, ఏటిగైరంపేట, జోగంపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గొలుగొండ ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో బాబూరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం ర్యాలీ చేఇ నివాస పరిసరాలు పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్న పాలెంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో చాయిసుధ, ఈవోపీఆర్డీ మేరీజోన్స్, ఈవో బాలదొర, సర్పంచ్ పోతల రామలక్ష్మి, ఉప సర్పంచ్ లాలం రాము పాల్గొన్నారు.

పారిశుధ్యంపై సదస్సులు.. ర్యాలీలు... మానవహారాలు

కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాలు



నర్సీపట్నంలో మొక్కల దత్తత పత్రం అందజేస్తున్న ఆర్డీవో రమణ



గొలుగొండ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో బాబూరావు

నాతవరంలో...

నాతవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జి.మంగవేణి కోరారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వేణుగోపాల్‌తో కలసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అడవుల శాతం తగ్గిపోతున్నదని, అందరూ మొక్కలు నాటితే ఈ సమస్య ఉండదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.సత్యశ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి లాలం శేషు, జడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్స, సర్పంచ్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు చీడిగుమ్మల విద్యార్థిని



విద్యార్థిని మైత్రితో ఉపాధ్యాయులు

గొలుగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చీడిగుమ్మల ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఆనందరావు తెలిపారు. ఈ నెల 19వ తేదీన భీమిలిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ బేస్‌బాల్ యు-4 కేటగిరీలో విద్యార్థిని జి.మైత్రి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ మేరకు మైత్రిని పీడీ సుమన్ అభినందించారు.

పోషకాహారంపై శ్రద్ధ తీసుకోండి

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

మాకవరపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని పాపయ్యపాలెం, సీతన్న అగ్రహారం, మాకవరపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మహిళలతో పీడీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. చిన్న వయస్సులో వివాహాలు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందిచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మకట్టు చానల్ గేట్లు ప్రారంభం

నాతవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మకట్టు చానల్‌కు కొత్తగా ఏర్పాటు చేసిన తొమ్మిది గేట్లను తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లగా గేట్లకు రంధ్రాలు ఏర్పడడంతో సాగునీరు సక్రమంగా అందేది కాదన్నారు. మన్యపురట్ల నీటి సంఘం అధ్యక్షుడు దివాణం కృషితోనే కొత్తగా గేట్లు ఏర్పాటయ్యాయని, తద్వారా నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అలాగే ఇక్కడ కాలువల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా గుర్రపు డెక్కను కూడా తొలగిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండవ డీఈఈ అనురాధ, ఏఈ శ్యామ్, తాండవ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ జోగిబాబు, సభ్యుడు పారుపల్లి దాసు, గన్నవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎస్.సన్యాసిదేముడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య, నాయకులు వెలగా వెంకట కృష్ణారావు, వి.సూర్యారావు, కె.నూకరాజు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



గేట్లను ప్రారంభిస్తున్న తాండవ చైర్మన్ సత్యనారాయణ

కంఠారం, బాలారం గ్రామాలను గొలుగొండలో విలీనం చేయాలి



జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్రకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని కంఠారం, బాలారం గ్రామాలను గొలుగొండ మండలంలో విలీనం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్రకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1886 పూర్వం నుంచి తాము గొలుగొండ మండలం తాలూకాలోనే ఉండేవారమన్నారు. తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కొయ్యూరు మండలంలోని విలీనం చేశారన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఏ అవసరమైనా గొలుగొండ మండలం మీదుగా 39 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొయ్యూరు మండలానికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గాడి శ్రీరామమూర్తి, స్థానిక నాయకులు రమణమూర్తి పాల్గొన్నారు.

రూ.170 కోట్లకు చోడవరం డీసీసీబీ టర్నోవర్

- బ్యాంకు సిబ్బందికి చైర్మన్ 'కోన' అభినందన



బ్రాంచి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీసీసీబీ చైర్మన్

చోడవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి రూ.170 కోట్ల టర్నోవర్‌కు చేరుకోవడడంపై బ్యాంక్ చైర్మన్ కోన తాతారావు స్థానిక మేనేజర్‌తో పాటు, ఉద్యోగులను అభినందించారు. శనివారం స్థానిక సహకార బ్యాంక్ బ్రాంచిని సందర్శించి బ్యాంకు ప్రగతి కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా బ్రాంచి టర్నోవర్ 170కోట్ల చేరడంతో ప్రశంసించడంతో పాటు, వచ్చే ఏడాదికి టర్నోవర్ రూ.200 పెంచాలని సూచించారు. రైతులకు బ్యాంకు ద్వారా మరింతగా పంట రుణాలు ఇతర రుణాలు సేవలు అందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో డీవీవీ ఎస్ వర్మ, బ్రాంచి మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మానవ వనరుల శాఖ మాజీ డైరెక్టర్‌తో ముఖాముఖి రేపు

చోడవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉషోదయ కాలేజీలో ఈనెల 22న రమణాజీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ కన్వీనర్ జె, రమణాజీ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ రాష్ట్ర మానవ వనరుల శాఖ మాజీ డైరెక్టర్ డి. చక్రపాణితో వ్యక్తిత్వ వి కాసం, యువతకు ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై విద్యార్థులతో మాట్లాడతారన్నారు. అలాగే, సామాజిక తనిఖీ అనే అంశంపై నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్ర సోషల్ ఆడిట్ శాఖ డెరెక్టర్ జి.శ్రీకాంత్ సమావేశం కానున్నారన్నారు. గ్రామీణప్రాంతానికి చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రమణాజీ కోరారు.

కొనసాగుతున్న డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

చోడవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూములు ఆ స్తులు రిజిస్ట్రేషన్లలో అమలు చేస్తున్న ప్రైమ్‌కార్డు 2.0 విధానంలో సాంకేతిక లోపాలు చక్కదిద్దాలని డిమాండ్ చేస్తూ డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన రెండవ రోజుకు చేరింది. స్థానిక కొత్తూరు జంక్షన్‌లో శిబిరంలో శనివారం తమ ఆందోళన కొనసాగించారు. సంఘం గౌరవ అధ్యక్షులు సీతారామయ్య, నాయకులు బొబ్బిలి చంద్రశేఖర్, శ్రీనివాసరావు, రామారావు, శ్రీనివాస్, నారాయణరావు, సంతోష్, నా యుడు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో ఆటో బోల్తా

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): బీఎన్ రోడ్డులో బంగారు మెట్ట జంక్షన్ వద్ద గల గోతిలో వడ్డాది వైపు వెళ్తున్న ఆటో శనివారం ఉదయం బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న గాయలు నేలపాలయ్యాయి. విషయం తెలుసుకుని టీడీపీ వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నరేశ్, వార్డుమెంబర్ తమ సొంత ఖర్చుతో క్రషర్ బుగ్గితో గోతులను పూడ్చారు.

తాచేరు వంతెన వద్ద తిప్పలు



కల్వర్టును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత కొండలరావు

బుచ్చెయ్యపేట: బీఎన్ రోడ్డులో విజయరామరాజు పేట వద్ద తాచేరు వంతెన వద్ద రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. తాడు సాయంతో రాక పోకలు సాగిస్తున్నారు. ఈ స్థితిలో శనివారం కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు ఈ వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. నెల దాటినా కాజ్‌వే నిర్మాణం పూర్తి కాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తంచేశారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర స్ఫూర్తితో పనిచేయండి

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బాలాజీనగర్‌లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని అధి కారులు, పారిశుధ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎండీవో అంజనేయులు, సీఐ అప్పలరాజు, సర్పంచ్ బండి నూకరత్నం, మండల జేఈ శాంతారాం, ఈవో శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

రోలుగుంట: మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి కుసర్లపూడిలో జడ్పీ పాఠశాల, చెత్తతో సంపద కేంద్రం వద్ద మొక్కలు నాటారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, సర్పంచ్ అప్పలనాయుడు, కార్యదర్శి రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ నాగేశ్వరిదేవి , ఎఎండీవో శివ ప్రసాద్ నారాయణ, స్పెషల్ ఆఫీసర్ గోపాలరాజు, తహశీల్దార్ లక్ష్మి, సర్పంచ్ లక్ష్మి ఉన్నారు.

రావికమతం: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని మండల టీడీపీ అధ్యక్షులు కోమటి శంకరావు పిలుపు నిచ్చారు. మేడివాడ, చినపాచిల హైస్కూల్‌లలో మండల ప్రత్యేక అధికారితో కలసి పాల్గొని మొక్కలు నాటారు. ప్రత్యేక అధికారిణి టి.సుజాత, సర్పంచ్‌లు వజ్రపు లీలా, కోమటి రామలక్ష్మి, ఎంపీడీవో ఒ.మహేశ్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామ స్వామి, టీడీపీ నాయకులు వజ్రపు శివ పాల్గొన్నారు.

చీడికాడ: మండల ప్రత్యేక అధికారి కేవీఎల్ఎన్.మూర్తి చీడికాడ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. వరహాపురం డంపింగ్‌యార్డు వద్ద సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి మొక్కలు నాటారు.ఖండివరంలో సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీ నివాసరావు, మండల పరిషత్ కో ఆప్షన్ మెంబరు షేక్ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పీలా పద్మావతి ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. తహశీల్దార్ కిశోర్‌లింకన్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో జి.ఎర్రయ్యమ్మ, స్థానిక వైద్యాధికారి సునీల్‌కుమార్, ఎస్ఐ సతీశ్, ఎంఈవో బొంజుబాబు, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే రాజు

దేవరాపల్లి: కాశీపురంలో మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీఓ సువర్ణరాజు శ్మశాన వాటిక, సంపద కేంద్రం వద్ద మొక్కలు నాటారు. నిషేధిత ప్లాస్టిక్ వాడుతున్న షాపు యజమానికి రూ. 2500, మరో షాపునకు రూ.10 వేలు జరిమానా విధించారు. సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ కిరణ్ వరప్రసాదు, ఏఈఈలు తేజ, చంద్రశేఖరు, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవీ తది తరులు పాల్గొన్నారు. ఎ. కొత్తపల్లిలో ఎంపీపీ చింతల బుల్లి.లక్ష్మి సర్పంచ్ వెంకటరమణ తదితరులు శ్మశాన వాటికలో మొక్కలు నాటారు.

సాగునీటి సంఘాల అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు



మాట్లాడుతున్న జలాశయ చైర్మన్ పాత్రునాయుడు

దేవరాపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైవాడ ప్రాజెక్టు పరిధిలో పది సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువల అభివృద్ధి రూ.50 లక్షలు మంజూరైనట్టు జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు తెలిపారు. శనివారం ఆయన సాగునీటి సంఘాల చైర్మన్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బండారు. సత్యనారాయణమూర్తి కృషితో ఈ నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రాజెక్టు పరిధిలోని 27 పనులు త్వరలో చేపట్టనున్నామన్నారు. కలెక్టర్ మరో రూ. 10 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, డీఈఈ సత్యంనాయుడు, జలాశయ వైస్ చైర్మన్ బొడ్డు రమాదేవీ, మురళి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు



కొత్తకోట పాఠశాలలో విద్యార్థులతో భోజనాలు చేస్తున్న రాజు

రావికమతం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు వారి ఆరోగ్యం కోసమే సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం ప్రభుత్వం అందజేస్తోందని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలో కొత్తకోట మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలను శనివారం ఆయన సందర్శంచారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలో శ్లాబ్ పెచ్చులూడిపోతున్న దృశ్యాన్ని పీవీఎస్ఎన్‌కు ఉపాధ్యాయులు తెలియజేశారు. వీటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు చింతల కిశోర్, కోన రమణ, లొట్ల శివ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా సుజాత



బాధ్యతలు స్వీకరించిన సుజాత

రావికమతం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రావికమతం మండల ప్రత్యేక అధికారిణిగా నర్సీపట్నం డివిజన్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ టి.సుజాత నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న భవానీ భక్తులు



ఆలయ ఆవరణలో భవానీ భక్తులు

మాడుగుల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాడుగల మోదకొండమ్మ అమ్మవారిని శనివారం తుని, డి పోలవరం నుంచి భవానీ భక్తులు దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు.

అభివృద్ధికి కృషిచేయాలి

రావికమతం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అభివృద్ధిలో నిలిపేందుకు కృషి చేయాలని నూతన ఎంపీడీవో మహేశ్‌ను టీడీపీ నియోజక వర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి సూచించారు. కొత్తకోట తన స్వగృహంలో ఆమెను ఎంపీడీవో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు. నాయకులు కోట గోవిందరావు, సత్యనారాయణ, శ్రీను, పాల్గొన్నారు.

రాయపురాజుపేటలో వైద్య శిబిరం

చోడవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేటలో శనివారం స్వస్థ్ నారీ. స్వస్థ పరివార్ వైద్యశిబిం రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు చేశారు. గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి దీపికతో పాటు, స్థానిక సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు, పంచాయతీ కార్యదర్శి నారాయణరావుపాల్గొన్నారు. సచివాలయంతో పాటు, పాఠశాల వద్ద గంగాధర్. రామునాయుడు మొక్కలు నాటారు.

దేవరాపల్లి: మండలంలోని గర్శింగిలో 156 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి వనజ తెలిపారు. ఆయుర్వేద వైద్యురాలు గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: చినఅప్పన్న పాలెంలో 200 రోగులను పరీక్షించి, మందులు అందించారు. సర్పంచ్ కోవెల ఈశ్వరరావు, సీహెచ్ మహేశ్ సహకరించారు. వీఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డి సత్యారావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాపకాలను తుడిచేసే అల్జీమర్స్



విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

వృద్ధాప్యంలో వేధించే సమస్యల్లో అల్జీమర్స్ ముందంజలో ఉంటుంది. 60 ఏళ్లు దాటిన వారిలో కనిపించే ఈ సమస్యను కుటుంబ సభ్యులు గుర్తించి బాధితులకు అండగా ఉండడం ఎంతో కీలకమని వైద్యులు పేర్కొంటున్నారు. అల్జీమర్స్ బారినపడినట్టు కుటుంబ సభ్యులు గుర్తించకపోవడం వల్ల వారి పట్ల వ్యవహరించే తీరు దారుణంగా ఉంటుందని, దీనివల్ల వృద్ధులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని నిపుణులు చెబుతున్నారు. అల్జీమర్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచి బాధితులకు కుటుంబ సభ్యుల నుంచి భరోసాను కల్పించాలనే ఉద్దేశంతో ఏటా సెప్టెంబరు నెలను అల్జీమర్స్ మంత్‌గా నిర్వహిస్తుంటారు. అలాగే సెప్టెంబర్ 21న అల్జీమర్జ్ డేగా నిర్వహిస్తూ ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ ఏడాది 'ఆస్క్ అబౌట్ డిమాన్షియా థీమ్'తో అల్జీమర్స్ డేను నిర్వహిస్తున్నారు. ఆదివారం వరల్డ్ అల్జీమర్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- 60 ఏళ్లు దాటిన వృద్ధుల్లో పెరుగుతున్న మతిమరుపు సమస్య
- చిన్నగా సమస్య మొదలై ఎనిమిదేళ్లలో తీవ్రమయ్యే అవకాశం
- తొలుత చిన్న చిన్న అంశాల్లో మతిమరపు.. ఆ తరువాత పూర్తిగా మరిచిపోయే చాన్స్
- బాధితులకు కుటుంబ సభ్యుల సహకారం అవసరమంటున్న వైద్యులు
- కేజీహెచ్‌లో నిర్వహించే ఓపీకి నెలకు 50 మంది వరకు రోగుల రాక
- తొలి దశలో సమస్యను గుర్తించి చికిత్స అందించడం ఎంతో కీలకం

నేడు వరల్డ్ అల్జీమర్స్ డే

అలోయిస్ అల్జీమర్స్ అనే జర్మన్ మానసిక శాస్త్రవేత్త 1906లో తొలిసారిగా ఈ వ్యాధి గురించి వివరించడంతో దీనికి అల్జీమర్స్ అని ఆయన పేరునే పెట్టారు. ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబర్ 21న వరల్డ్ అల్జీమర్స్ డే, సెప్టెంబరును అల్జీమర్స్ మంత్‌గా నిర్వహిస్తూ వస్తున్నారు. ఏటా భిన్నమైన థీమ్‌తో అల్జీమర్స్ డేను వరల్డ్ అల్జీమర్స్ అసోసియేషన్ నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాది డిమాన్షియా గురించి అడగండి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

మెదడుకు సంబంధించిన వ్యాధి

అల్జీమర్స్ మెదడుకు సంబంధించిన తీవ్రమైన వ్యాధుల్లో ఒకటి. అల్జీమర్జ్ అంటే మతిమరుపు అని అర్థం. 60 ఏళ్లు దాటిన వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. జన్యుపరమైన కారణాల వల్ల రెండు నుంచి మూడు శాతం మందిలో 40 ఏళ్లు దాటిన వారిలోనూ ఈ సమస్య కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య ఐదేళ్లకు ఒకసారి తీవ్రమవుతూ ఉంటుంది. అంటే జ్ఞాపక శక్తిని మరిచిపోయే వాటి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. వయసుతో పాటు వచ్చే ఈ సమస్యను చాలామంది పని ఒత్తిడి, చదువుల ఒత్తిడి వల్ల వచ్చే మతిమరు పును అల్జీమర్స్‌గా భావిస్తూ ఆందోళనకు గురవుతుంటారు. కానీ అటువంటి ఆందోళన అవసరం లేదని, అల్జీమర్స్ అంటే 60 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే కనిపించే సమస్య అని వైద్యులు పేర్కొంటున్నారు.



నాలుగు రకాలు..

మతిమరుపు సమస్యను నాలుగు రకాలుగా చెబుతారు. ప్రీ క్లినికల్ డిమాన్షియా, మైల్డ్ అల్జీమర్స్, మోడరేట్ అల్జీమర్స్, సివియర్ డిమాన్షియా. ప్రీ క్లినికల్ డిమాన్షియాను మొదటి దశగా చెప్పవచ్చు. ఇందులో కొన్ని రకాల పరీక్షల ద్వారా సమస్యను ముందుగా గుర్తిస్తారు. బయో మార్కర్ టెస్ట్ చేసి దీనిని గుర్తించడం జరుగుతుంది. ఈ దశలో లక్షణాలు పెద్దగా కనిపించవు. మైల్డ్ అల్జీమర్స్ దశలో రోగి వేగంగా కొన్ని విషయాలను మరిచిపోతుంటారు. నగదు లావాదేవీలు చేయలేకపోవ డం, అడ్రస్ మరిచిపోవడం వంటి ఇబ్బందులుంటాయి. క్రమంగా జ్ఞాపకశక్తి తగ్గుముఖం పడుతుంది. మూడో దశలో మోడరేట్ అల్జీమర్స్ వస్తుంది. మతిమరుపు ఎక్కువగా ఉంటుంది. అడిగిన ప్రశ్నలనే పదేపదే అడగడం, చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పడం వంటివి చేస్తుంటారు. ఇంట్లో వాళ్లు ఈ తరహా వైఖరితో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. బయటకు వెళ్లి తిరిగి రాలేకపోవడం, బాత్రూమ్, ఇతర అవసరాలను మర్చిపోవడం, యూరిన్ పోసేయడం, భ్రమిస్తూ మాట్లాడడం, అనుమానించడం వంటి సమస్యలు ఉంటాయి. నాలుగో దశను సివియర్ డిమాన్షియాగా పేర్కొంటారు. ఈ దశలో యూరిన్, మోషన్ వంటివన్నీ బెడ్ మీదే కానిచ్చేస్తారు. బంధువులు, కుటుంబ సభ్యులను గుర్తించలేని స్థితికి చేరుకుంటారు. మొదటి దశ నుంచి నాలుగో దశకు చేరుకునేందుకు ఎనిమిది నుంచి 12 ఏళ్లు సమయం పడుతుంది. కొన్నిసార్లు ఐదారేళ్లలో కూడా ఈ పరిస్థితికి చేరుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు..

అల్జీమర్‌తో బాధపడే వారిలో కొన్ని లక్షణాలు ఉంటాయి. మూడు రకాల మెమోరీని నెమ్మదిగా లాస్ అవుతుంటారు. సాధారణంగా ప్రతిఒక్కరిలో తక్షణ జ్ఞాపకశక్తి, రీసెంట్ జ్ఞాపకశక్తి, రిమోట్ మెమోరీ అనేవి ఉంటాయి. అల్జీమర్‌తో బాధపడే వారు ఈ మూడింటిని పూర్తిగా మరిచిపోతుంటారు.

ఇదీ చికిత్స

అల్జీమర్స్ వ్యాధి తీవ్రత, లక్షణాలను బట్టి చికిత్సను అందిస్తారు. నాన్ డ్రగ్స్‌లో భాగంగా మెదడుకు మేత పెట్టే అంశాలపై దృష్టి సారించేలా చేసి మరిచిపోకుండా చేయవచ్చు. ఉదయాన్నే వాకింగ్ చేయడం, పిల్లలతో ఆటలాడడం, పజిల్స్ సాల్వ్ చేయడం, సీరియల్స్ సినిమాలు వంటి చూసేలా చూడాలి. అదేవిధంగా తాజా కాయగూరలు, పండ్లు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకునేలా చూడాలి. వైద్యుల సూచనల మేరకు కొన్ని రకాల మందులు వాడాలి.

కుటుంబ సభ్యుల సహకారమే కీలకం



-డాక్టర్ బుచ్చిరాజు, న్యూరాలజీ వైద్య నిపుణులు

అల్జీమర్స్ అనే వ్యాధి వృద్ధాప్యం లో వచ్చే సర్వసాధారణమైనది. 60 ఏళ్లు దాటిన వారిలో ప్రారంభ మయ్యే సమస్య ఎనిమిది నుంచి 12 ఏళ్లలో తీవ్ర మవుతుంది. రోజులు గడుస్తున్నకొద్దీ మరిచిపోయే వాటి సంఖ్య పెరుగుతుంది. చివరి దశకు చేరు కునేసరికి ఇల్లును, కుటుంబ సభ్యులను మరిచిపోవ డం, ఇంట్లోని రూమ్‌లను మరిచిపోవడం, యూరి న్ పోసేయడం వంటి ఇబ్బందులు ఏర్పడతాయి. రెండు, మూడు దశల్లో కుటుంబ సభ్యులు తీవ్ర మైన ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. ఆ సమయంలో కుటుంబం నుంచి సహకారం తప్పని సరిగా అవసరం అవుతుంది. చిన్నపిల్లాడి మాదిరి గా వారిని ట్రీట్ చేయాలి. వారికి అవసరమైన మెడికేషన్ ఇవ్వడంతో పాటు మెదడుకు మేత పెట్టే కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా కొంత వరకు సమస్యను అదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది.

సాహితీ వేగుచుక్క గురజాడ



- మూఢనమ్మకాల చీకటిలో మగ్గిపోతున్న సమాజానికి వెలుగు చూపిన దార్శనికుడు
- సాంఘిక దురాచారాలపై అక్షర శరసంధానం
- సరళమైన పదాలతో అందరినీ ఆకట్టుకునే శైలి
- 'కన్యాశుల్కం'...గరజాడ రచనల్లో అగ్రస్థానం

నేడు గురజాడ అప్పారావు జయంతి

పందొమ్మిదో శతాబ్దంలో ఆనాటి సాంఘిక అసమానతలు, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రచనలు చేసిన కొద్దిమందిలో గురజాడ అప్పారావు ఒకరు. దార్శనిక దృక్పథంతో ఆయన రచనలు సాగించారు. ఆధునిక సాహిత్యంలో కొత్త ఒరవడులకు శ్రీకారం చుట్టారు. తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించారు. 'కన్యాశుల్కం' నాటకం వందేళ్లు పూర్తి చేసుకున్నా ఇప్పటికీ ప్రదర్శన జరిగితే ప్రేక్షకుల నుంచి లభించే ఆదరణే ఇందుకు ఉదాహరణ. సులభమైన శైలి, జీవితంలో తారసపడే పాత్రలు, ఏకబిగిన చదివించే కథ, కథనం, కవిత్వం రాసిన సాహితీ సుమం గురజాడ. ఆయన యుగకర్త. సాహిత్యం సామాజిక అభ్యున్నతికి, సంఘ సంస్కరణకు దోహదపడాలని చెప్పిన ఉదాత్త ఆశయం గురజాడది. అందుకే తెలుగు సాహిత్యంలో ఆయన స్థానం ఎప్పటికీ పదిలం. నేడు గురజాడ జయంతి సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక కథనం...

జన్మస్థలం...సర్వసిద్ధి రాయవరం

అనకాపల్లి జిల్లా సర్వసిద్ధి రాయవరంలో 1862 సెప్టెంబరు 21న వెంకట రామదాసు, కౌసల్యమ్మ దంపతులకు గురజాడ జన్మించారు. పూర్వం సర్వసిద్ధిలో కోర్టు వుండేదని చెబుతారు. గురజాడ తాతగారు కోర్టులో కొలువు చేసేవారు. దీంతో గురజాడ తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు తల్లిదండ్రులున్న సర్వసిద్ధి రాయవరం వచ్చారు. ఆ విధంగా గురజాడ సర్వసిద్ధి రాయవరంలో జన్మించారు. కాలక్రమేణా ఎస్.రాయవరంగా ఈ ప్రాంతం స్థిరపడింది. ఆయన ఉన్నత చదువుల కోసం విజయనగరం వెళ్లారు. వచన, వ్యవహారిక భాషకు ఆద్యుడిగా పేరొందిన గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ ప్రాణస్నేహితులు. 53 సంవత్సరాల వయసులోనే గురజాడ ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయారు. 1915 నవంబర్ 30న భౌతికంగా ఆయన దూరమైనా ఆయన రచనలు ఇప్పటికీ వన్నెతగ్గకుండా సాహితీ ధ్రువతారగా నిలిపాయి.

'మాటకున్నంత పదును కత్తివేటుకు కూడా ఉండదంటారు. అందుకేనేమో కత్తికంటే కలం గొప్పదని చెబుతుంటారు. గురజాడ వంటి సాహితీ ప్రముఖుల అక్షరాయుధాలను తరచి చూస్తే ఈ మాట ఎంత అక్షర సత్యమో అర మవుతుంది. 'తాంబూలాలిచ్చేశాం ఇక తన్నుకు చావండి, డామిట్ కథ అడ్డం తిరిగింది, పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్ వంటి వాక్యాలు గురజాడ కలం పదును తెలిపే అక్షర సాధనాలు. 'కన్యాశుల్కం' నాటకం గురించి తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. గురజాడ ఆణిముత్యాల్లాంటి రచనల్లో దీనిది అగ్రస్థానం. సమాజంలోని పలు దురాచారాలను 'కన్యాశుల్కం' అనే ఒకే అక్షర శరంతో దునుమాడిన ఘనుడు గురజాడ. అందుకే భారతీయ భాషల్లోనే ఉత్తమోత్తమ రచనల్లో ఒకటిగా ఇది నిలిచింది. ఎన్నో భాషల్లోకి 'కన్యాశుల్కం' అనువదించారంటే దాని ఇతివృత్తం, గురజాడ రచనల్లోని సొగసరి తనం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్.. ఒట్టిమాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్' అంటూ మాటలతో కాలక్షేపం చేసే వారికి చురకంటించిన ఘనుడు గురజాడ. రాశిలో తక్కువ రచనలైనా వాసికెక్కిన రచయితగా అచ్చ తెలుగు పదహారణాల కలం యోధుడు గురజాడ అప్పారావు. గురజాడ పేరు చెప్పగానే విజయనగరం, బొంకులదిబ్బ, మూడులాంతర్ల జంక్షన్ గుర్తుకువస్తాయి.



వ్యవహారిక భాషోద్యమం

వ్యవహారిక భాషోద్యమాన్ని ఉధృతం చేసేందుకు గురజాడ సరళ గ్రాంథికంలో రచనలు చేయడం ప్రారంభించారు. తనను తాను మార్చుకుని వ్యవహారికం దిశగా అడుగులు వేశారు. తనదంటూ ప్రత్యేకశైలి వాడారు. తన రచనల్లో రచయిత కన్పించకుండా ఇతివృత్తమే ప్రధానంగా సాగేలా జాగ్రత్తపడ్డారు. ఉపోద్ఘాతాలు, వర్ణనలు లేకుండా గురజాడ సరాసరి కథను ప్రారంభిస్తారు. ఇందుకు 'కన్యాశుల్కం' ఓ ఉదాహరణ. ఆనాటి సాంఘిక దురాచారాల్లో ఒకటైన వేశ్యాలోలత్వం ఇందులో కథా వస్తువు. భర్తతో గొడవ పడకుండా, పుట్టింటికి పారిపోకుండా గడప దాటకుండానే ఇంట్లోని భర్తకు బుద్ధిచెప్పి లెంపలేసుకున్నట్టు చేయడం గురజాడ కథా నాయికల గొప్పతనం.

దారికి రాని పనులు

... 5వ పేజీ తరువాయి

గత నెల కోర్టులో కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. దీనిపై కోర్టు ఈ నెల 20కి కేసు వాయిదావేసి, గడువు లోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తీసుకోవడంతో పాటు హైకోర్టుకు లేఖ రాస్తామని హెచ్చరించారు. ఈ కేసు విచారణ వచ్చే వారానికి వాయిదా పడడంతో ఏం జరగబోతోందననే ఆసక్తి అందరిలో ఉంది.

వర్షంతో ఊరట

... 5వ పేజీ తరువాయి



అనకాపల్లిలో లైట్ల వెలుతురులో వెళుతున్న కారు

ఈదురుగాలుల బీభత్సానికి 12 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం కురిసిన వర్షానికి 8 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో అనకాపల్లి రూరల్ పోలీసులు, ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది కేబీ రోడ్డుకు చేరుకొని దారిపొడవునా పడిపోయిన విద్యుత్ స్తంభాలు, చెట్లను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం

విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి, ఎస్పీ తుహిన్‌సిన్హా, ఆర్‌జేడీ విజయభాస్కర్ తదితరులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విలువైన జ్ఞానాన్ని పొందవచ్చని విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. శనివారం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రంథాలయంలో రీడింగ్ రూమ్, అల్లూరి విగ్రహం చుట్టూ స్టీల్ కంచె, ఐరన్ మెట్లను డీఐజీ, ఎస్పీ తుహిన్ సిన్హా ప్రారంభించారు. అనంతరం పదవీవిరమణ చేసిన 11 మంది టీచర్లను, డీఎస్సీలో ఎంపికైన 9 మందిని, పలువురు రిటైర్డు పోలీసు అధికారులను డీఐజీ, ఎస్పీ, విద్యా శాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఐజీ గోపీనాథ్‌జెట్టి మాట్లాడుతూ పదేళ్లుగా పోలీసులు, స్థానికుల సహకారంతో గ్రంథాలయం నడపడాన్ని అభినందించారు. ప్రస్తుతం సోషల్ మీడియా రావడంతో గ్రంథాలయాలు కనుమరుగవుతున్నాయని, వాటి అభివృద్ధికి ఆయా ప్రాంతాల్లో ఉపాధ్యాయుల సహకారంతో పోలీసులు కృషిచేస్తారన్నారు. అల్లూరి స్ఫూర్తితో గంజాయి సాగు, రవాణా నిర్మూలనకు సహకరించాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో ఉన్నతశిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. ఇందుకు కృష్ణాదేవిపేట నుంచి 9మంది డీఎస్సీలో అర్హత సాధించడమే నిదర్శనమన్నారు. ఆర్‌జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువు వస్తుందని, గ్రంథాలయాల్లో అపార జ్ఞానం పొందవచ్చాన్నారు.

తొలుత ఎన్‌సీసీ విద్యార్థులు డీఐజీకి గౌరవవందనం చేశారు. దాతలు అందించిన పుస్తకాలు, క్రీడా సామగ్రిని అతిథులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు ఎల్.రేవతమ్మ, అల్లు స్వామినాయుడు. జి.సోమశేఖర్, ఎస్‌ఐలు వై.తారకేశ్వరరావు, పి.రామారావు అల్లూరి మైత్రి గ్రంథాలయ సభ్యులు శర్మమాస్టర్, పోతల శ్రీరామమూర్తి, డేవిడ్ దైమన్‌రాజు, సత్యనారాయణ, అచ్చిరాజులు, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భర్త మందలించాడని ఆత్మహత్య



మృతురాలు సుందరి

కోటవురట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టివాడ శివారు అణుకు గిరిజనగ్రామంలో పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కోటవురట్ల ఎస్‌ఐ రమేశ్ అందించిన వివరాలిలా ఉన్నాయి.

మండలం గొట్టివాడ శివారు అణుకు గిరిజనగ్రామానికి చెందిన గెమ్మిల సుందరి (29) ఈనెల 16వ తేదీన ఉదయం పిల్లలు ఏడుస్తున్నారని మందలించింది. దీంతో భర్త కామేశ్ ఆమెను మందలించాడు. అతను ఇంటి నుంచి పనికి వెళ్లిన తర్వాత ఎవరు లేని సమయంలో ఆమె మనస్తాపానికి గురై ఇంటి దగ్గరలోని జీడిమామిడితోటలకు వాడే పురుగుల మందు (గడ్డిమందు) తాగి అపస్మారక స్థితిలోకి జారుకుంది. పక్కింటి అతను గమనించి ఆమెను వైద్య సేవల నిమిత్తం కోటవురట్ల 50 పడకల ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి అప్పటికే విషమంగా మారడంతో వైద్యులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి రిఫర్ చేశారు. అక్కడ డాక్టర్లు ఆమె పరిస్థితి ఆందోళనకరగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్ ఆస్పత్రికి అదేరోజు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 8 గంటలకు మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సుందరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్రేన్ ఢీకొని పాస్టర్ మృతి



ఆలపు ప్రసాద్ (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటకు చెందిన పాస్టర్ తునిలోని చర్చికి వెళుతుండగా క్రేన్ ఢీకొనడంతో శనివారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన పాస్టర్ ఆలపు ప్రసాద్(40) నిత్యం ఏదో ఒక చర్చిలో సువార్త చెబుతూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం తునిలోని ఓ చర్చిలో సువార్త చెప్పేందుకు వెళుతుండగా తునిలోని రైల్వే ఫ్లైఓవర్‌పై వెళుతున్న క్రేన్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ప్రసాద్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తుని పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

... 5వ పేజీ తరువాయి



ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు ఇస్తున్న డీఈవో

మరో విద్యార్థి ప్రిన్సిపాల్ రాజశేఖర్‌కు చెప్పాడు. దీంతో ప్రిన్సిపాల్ పాఠశాల గదిలో ఉన్న పవన్‌కృష్ణ, షణ్ముఖ సాయిరాజ్‌లను స్టీల్ స్కేల్‌తో శరీరంపై తట్లు తేలేలా కొట్టారని ఆ విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపణ. ఈ విషయమై శనివారం స్కూల్ వద్దకు వచ్చిన తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు బైఠాయించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న డీఈవో అప్పారావునాయుడు స్కూల్‌కు వచ్చి పరిశీలించారు. విద్యార్థుల శరీరాలపై ఉన్న తట్లను పరిశీలించి నివ్వెరపోయారు. ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంతో ఈ సంఘటనపై వివరణ ఇవ్వాలని సూచిస్తూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మజకు నోటీసు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాజాన దొరబాబు, గాడి బాలు, వియ్యపు రాజు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో స్కూల్ ప్రిన్సిపాల్

విద్యార్థులను విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచిన స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ శనివారం రాత్రి తెలిపారు. గాంధీనగరంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో శుక్రవారం ఇద్దరు విద్యార్థులను తీవ్రంగా కొట్టి గాయపరిచిన సంఘటనపై ఒక విద్యార్థి తండ్రి వరహాలబాబు శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

లక్ష్యం సాధించే వరకు పట్టు విడవకూడదు

- ఉత్తరప్రదేశ్ అవినీతి నిరోధక సంస్థ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ



మాదక ద్రవ్యాలు నియంత్రణకు ప్రతిజ్ఞ చేస్తున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులు, డీఎస్పీ

నర్సీపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని సాధించే వరకు పట్టు విడవకుండా ప్రయత్నించాలని ఉత్తరప్రదేశ్ అవినీతి నిరోధక సంస్థ అదనపు డీజీపీ కిల్లా సత్యనారాయణ అన్నారు. శనివారం స్టార్ హోమ్స్‌లో ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో మాట్లాడారు. ఒక లక్ష్యం పెట్టుకొని కష్టపడి పనిచేయాలని, సాధించే వరకు పట్టు విడిచి పెట్టకూడదన్నారు. విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ డ్రగ్ రహిత సమాజం కోసం అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా చేయడమే సంకల్పం లక్ష్యమన్నారు. ఎస్పీ తుహీన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నిర్మూలనే సంకల్పం లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు గోవిందరావు, రేవతమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, ఏరియా ఆస్పత్రి సైక్రియాటిస్ట్ డాక్టర్ పరమేశ్వరి పాల్గొన్నారు.

ప్రశంసే ఆమెకు పెద్ద బహుమతి

... 5వ పేజీ తరువాయి

ప్రశంసించాలి. మనసులో గంపెడు ప్రేమ ఉన్నా..వ్యక్తీకరించకుంటే నిష్ఫలమే. అందుకే ఆమెపై ఉన్న ప్రేమాభిమానాలను ఎప్పటికప్పుడు వ్యక్తీకరించాలి.

భార్యకు ప్రాధాన్యం ఇవ్వండి

భార్యకు అన్ని విషయాల్లో ప్రాముఖ్యం ఇస్తే ఆమె సంబరపడుతుంది. కుటుంబ విషయాలన్నీ ఆమెతో పంచుకుని ఆమె సలహాలు తీసుకోవడం వల్ల మరింత సంతోషంగా ఉంటుంది. అలాగే ఎంత బిజీగా ఉన్నా వారానికి ఒక్క రోజైనా.. కుటుంబంతో కలిసి గడిపేందుకు ప్రయత్నించండి. రోజులో ఎంత బిజీగా ఉన్నా..కొంత సమయాన్ని ఆమెతో మాట్లాడేందుకు కేటాయించండి. అలాగే ఆమెతో ఉన్న జ్ఞాపకాలను ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోండి. ప్రత్యేక దినాల్లో ఆమెను డిన్నర్‌కు తీసుకువెళ్లే ప్రయత్నం చేయండి.

పనిలో సాయపడాలి

ఆమెకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటే.మీరు ఓ చేయి వేయండి. పనిలో ఆమెకు సహకరించండి. ఆమెకు మీరు చేసే చిన్నపని వల్ల శారీరకంగా శ్రమ తగ్గకపోయినా.. మానసికంగా కలిగే ఆనందం వెల కట్టలేం.

గౌరవించండి

ఆమెకు గౌరవాన్ని ఇవ్వండి. ఆమె మాటకు విలువ ఇవ్వండి. పది మందిలో ఆమెను చులకన చేయకండి. వీలైతే పది మందిలో ఆమె గొప్పతనాన్ని షేర్ చేసుకోండి. విమర్శలు అందరి మధ్యా చేయకండి. ఏదైనా లోపం ఉంటే ఆమెకు ఒంటరిగా చెప్పండి. అదే ఆమెకు ఇచ్చే గౌరవం అని గుర్తుంచుకోండి.

ఇంట్లో ఉన్నా ఎక్కువ కష్టపడేది భార్య

ఉద్యోగం చేసే పురుషులు రోజుకు 8 నుంచి 10 గంటలు కష్టపడతారు. ఇంట్లో ఉన్న భార్య కనీసం 15 గంటలు కష్టపడుతుంది. ఆ స్థాయిలో పనిచేస్తేగానీ అన్ని పనులు చక్కబెట్టే వీలుండదు. ఉదయం ఇల్లు తుడవడం మొదలు, పిల్లల్ని స్కూళ్లకు సిద్ధం చేయడం, వంట, వార్పు, భర్త ఆఫీసు సమయానికి తగిన ఏర్పాట్లు...ఇలా లేచిన దగ్గర నుంచి ఉరుకులు, పరుగులే. మళ్లీ సాయంత్రం అదే తంతు. పిల్లల చదువు, హోంవర్క్.. వంట పూర్తిచేసి రాత్రి పడుకునేసరికి రాత్రి 11 గంటలు దాటుతుంది. ఇక, ఉద్యోగం చేసేవారైతే చెప్పాల్సిన అవసరం లేదు. అటు ఉద్యోగ బాధ్యతలు, ఇటు ఇంటి నిర్వహణతో రెండు పడవలపై ప్రయాణించక తప్పని పరిస్థితి. అంతగా కష్టపడే ఆమె శ్రమకు ప్రతిఫలంగా ప్రశంసే కోరుకుంటుంది.